నందన నామ సం. భాద్రపదము

విషయసూచి.

సంపుటము - 2
సంచిక - 3

1. సుభాషిత త్రిశతియందలి వైరాగ్య పద్యములు — 101-104
2. వ్యాస పరిచయములు — 105-106
3. నీతి కథలు — 107-108
4. ప్రభావతీప్రద్యుమ్నము — 109-116
5. ఆంధ్రకవుల చరిత్రము — 117-124
6. జంతువుల స్వభావ చరిత్రము — 125-132
7. ఛందశ్శాస్త్రము — 133-136
8. ఆనందబాయి జోషీ. యం. డి — 137-139
9. 6 వాల్యూము — 140
10. స్త్రీ హితోపదేశము — 141-144
11. మహాపురుషుల జీవిత విశేషములు మొదలగు విషయములు — 145-148

శ్రీ

చింతామణి.

ఇది మాసమున కొకసారి ప్రకటింపఁబడును.

సంపుటము ౨.] రాజమహేంద్రవరము: నందన సంవత్సర భాద్రపద మాసము. (30-9-92.) [సంచిక ౩.

సుభాషిత రత్నావళియొక్క కృత్యాది పద్యములు.

భర్తృహరిచే సంస్కృతమున సుభాషితరత్నావళియను పేర నీతిశృంగార వైరాగ్యశతకములు రచియింపఁబడి యేనుఁగు లక్ష్మణకవిచే నాంధ్రీకరింపఁబడినవి. సంస్కృతమునుండి తెనిఁగింపఁబడిన గ్రంథములలో నింత నిర్దుష్టముగను, మృదు మధురముగను, మూలమున కనుగుణ్యముగను రచియింపఁబడిన గ్రంథము సాధారణముగా వేరొకటి కానము. ఈకవీశ్వరుఁ డొకానొకచోట మూలగ్రంథమునకంటెను నెక్కువ రసమును దీసికొనివచ్చెనని కవీశ్వరుల యభిప్రాయమై యున్నది. ఒకభాషయందలి యభిప్రాయమును మఱియొక్క భాషలోనికి దీసికొనివచ్చుట మిక్కిలి దుర్లభము. ఇతని నివాసగ్రామము కాకినాడకు సమీపమునందున్న పెద్దాడ యని కృత్యాది పద్యములవల్లను, ఆశ్వాసాంత పద్యములవల్లను, తెలియుచున్నది. ఇతఁడు వాధూలసగోత్రుఁడు. వీరింటిపేరు మొదట పైడిపాటివారైనను పెద్దాపురమునందు ప్రభుత్వముచేసిన గజపతు లితనివంశపూర్వుఁడయిన సింగనమంత్రికి యేనుఁగులతోఁడ అగ్రహారములిచ్చుటఁబట్టి యితనికీయింటిపేరు గలిగెను. ఇతఁడు కూచిమంచి తిమ్మన సమకాలీనుఁడని చెప్పుదురు. పురాతన గ్రంథములయందు నాకు దొరకిన యొకప్రతినుండి అచ్చుపడిన గ్రంథములయందు లేని యీకృత్యాదిపద్యములు చదువరుల కాహ్లాదము కలిగించునని వ్రాయుచున్నాను. ఇతఁడు రామేశ్వరమాహాత్మ్యమును, విశ్వామిత్రచరిత్రమును, సూర్యశతకమును, గంగామాహాత్మ్యము మొదలగు గ్రంథములను రచియించినాఁడు.

K. R. V. KRISTNA ROW.

ఉ॥ శ్రీలలితాద్రిజా ఘుసృణచిత్రకరాగము గాంచి తావక।
భ్రూలతపల్లవించె ననఁబోఁడినిజంబని మించుటద్దముల్।
నేలఁధరించి శ్రీముఁదిలకింపఁగఁ జూపు విలాసశాలికిన్।
పాలిత సర్వభక్తజనపాళికి మ్రొక్కెదఁ జంద్రమౌళికిన్॥౧॥

ఉ॥ తోయధిసారమై యితరదుర్లభమై గుణరమ్యమై జగ।
ద్ధేయమహత్త్వమై భువనదీపకమై కమలాఖ్యమై నిశా।
నాయకసోదరంబయి మనఃప్రియమౌ రతనంబులోమ్మునన్।
బాయక తాల్చుశౌరి నిరపాయసుఖంబులు మాకు నీవుతన్॥ ౨॥

ఉ॥ పాణినుకుల్ ముఖాబ్జములభారతి నెచ్చెలులై భజింప నా।
త్తామరపుష్పపీఠముగఁ దాపసముఖ్యులు సర్వనిర్జర।
గ్రామణులాత్మకింకరులుగా జగమేలెడు మేటిభక్తచిం।
తామణి మాకు సత్కృపఁ బితామహుఁ డిచ్చుఁ జిరాయురున్నతుల్॥ ౩॥

ఉ॥ శంకరచారుదృక్కుముదచంద్రిక యోగిజనప్రసన్నహృ।
త్పంకజరాజహంసి శ్రితదర్పణదృశ్య నిజస్వరూప వి।
శ్వాంకుర జన్మభూమి తుహినాద్రితపఃఫలరాశి చంద్రరే।
ఖాంకిత రమ్యవేణి జగదంబ శుభంబులు మాకు నీవుతన్॥ ౪॥

చ॥ మినుకుకడానిపైఁడి పసమించిన నెమ్మెయి డాలుజాళువా।
ననజడి క్రైవడిన్ మగని నల్లని మేనికి వన్నెపెట్టఁగా।
గొనబు వహించు జవ్వని ముకుందుని పట్టపుదేవి ప్రేమతో।
వననిధికన్య మామకనివాసముల న్వసియించుఁగావుతన్॥ ౫॥

క॥ రామేశ్వర మహిమము వి। శ్వామిత్రచరిత్ర సూర్యశతకంబును గం।
గా మాహాత్మ్యము మొదలగు। శ్రీమత్కృతిరత్నములు రచించితిమఱియున్॥ ౬॥

వ॥ ఏనొక్క చాటుప్రబంధంబు రచించెదనని నిశ్చయించి దేవపూజా సదనంబు
నఁ బద్మాసనాసీనుండనయి చిత్తంబు నియమాయత్తంబుఁగావించి పురహర
చరణారవింద ధ్యాన సుధానుభవంబు చేయుచున్నసమయంబున॥

సీ॥ కలధౌతగిరియును గలధౌతగిరియును విల్లుగాఁ బొదపైన యిల్లుగాఁగ।
గమలాహితుండును గమలాహితుండును శరముగా లలితశేఖరముగాఁగ।
బద్మోద్భవుండును బద్మోద్భవుండును సాదిగా మెయిదాల్పు బూదిగాఁగ।
బవనప్రియుండును బవనప్రియుండును సొమ్ముగా ఫాలనేత్రమ్ముగాఁగ।
గాలిలు పెనుపేల్పు మమ్మెనవాలు దాల్పు। జగములకు ఱేఁడు ధనదుని సంగడీఁడు।
హరుఁడు పెద్దాదసోమశంకరుఁడు హృదయ। సరసిజంబున నాకు సాక్షాత్కరించె॥

క॥ ఈరీతిన్ గృతసాక్షా। త్కారుండగు సాంబశివునిఁ గని మానసపూ।
జారచనలఁ గొలిచి నమ। స్కారంబులఁ జేసితిన్ వికస్వరమతినై॥ ౯॥

క॥ అతిబేలానంద సమ। న్వితుఁ నన్నుఁ గృపాకటాక్ష నిబిడజ్యోత్స్నా।
ప్లుతుఁ జేసి పార్వతీపతి। హితమతి నతిమధురఫణితి నిట్లనిపలికెన్॥ ౧౦॥

చ॥ నెలకొనిరియ్యగాఁ బలుకనేర్పును మాకనివేడుభంగి రా।
చిలుకయు వీణయుం దనుభజింపఁగ గీతసుధాపయోధిలోఁ।
బొలుపుగ నోలలాడు ననబోఁడి నిరంతరసుప్రసన్నయై।
పలుకువెలంది నావదనపద్మమునన్ విహరించుఁగావుతన్॥౧౧॥
శా॥ శ్రీవాణీరమణాదులెవ్వని జయశ్రీకాములై కొల్తురే।
దేవుం బ్రాఁజదువుల్ గజాననుని దెల్పున్ జగత్కర్తగా।
నావిద్యాగురునిన్ గణేశ్వరుని భక్తాభీష్ట సంధాయకున్।
సేవింతున్ మదిలో వినాయకుని సుత్కేమార్థసంసిద్ధికిన్॥౧౨॥
ఉ॥ మూడుగుణంబులున్ బరమమూర్తులు మూడును మూడువేదముల్।
మూడుమహాక్షరంబులొక మూర్తిగఁబూనిన మేటివేలుపుం।
బ్రోడలకేలుమోడ్పులు సమున్నతిఁగైకొను సామిచూడ్కికిన్।
వేడుక సేయు దేవునిఁగవిస్తుత తేజరవిన్ భజించెదన్॥౧౩॥
చ॥ ఇనజునితోడ మైత్రి ఘటియించియు వారిధి దాఁటి జానకిన్।
గనుఁగొనివచ్చియున్ జవము గైకొని మందులు దెచ్చి లక్ష్మణున్।
మనిచియు దైత్యులన్ బిలుకుమార్చియు రాఘవు చేత మెప్పుఁబొం।
దిన హనుమంతు శాంతు వినుతింతు మహాబలవంతు నెంతయున్॥౧౪॥
గీ॥ యుక్తినొక్కొక్కవర్ణ మత్యుగ్రపాప।
విదళనము చేయ శతకోటి విస్తరముగ।
రామచరిత మొనర్చిన వామలూరు।
సంభవునకుఁ బ్రణామముల్ సంఘటింతు॥౧౫॥
గీ॥ పరమపావనమగు మహాభారతంబు।
పంచమామ్నాయముగ రచియించి ప్రజకు।
ముక్తిమార్గంబు చూపిన మునికులేంద్రు।
బాదరాయణుఁ గవిసార్వభౌముఁ దలఁతు॥౧౬॥
గీ॥ సారకవితా సుధారసాసారకలన।
రసికజనుల మనోమయూరములఁ దనుపు।
ఘనులవర్ణింతు శివభద్రకాళిదాస।
చోరమాఘమయూరాది సుకవివరుల॥౨౦॥
ఉ॥ ఆయతియుక్తి మువ్వురు మహామునులందిత వాక్ప్రపంచ ధా।
రేయులు శబ్దశాస్త్రమొనరించినభంగి సుధారధారలా।

మాన్యయము విశ్వసాక్షుల నొనర్చినమాన్యుల నన్నయార్యునిన్ ।
ధీయుతు శంభుదాసుఁ గవితిక్కమఖీశ్వరుఁ బ్రస్తుతించెదన్ ॥౨౧॥

సీ॥ సోమభాస్కర శ్రీనాథభీమరామ। భద్రవీర భద్రాద్రిసుల భద్రకవుల।
మానసీయుల దేవతామహిమఁబూని। యలరువాంధ్రిక కీంద్రుల నభినుతిం

క॥ ఆకరపల్లి కులాబ్ధిం। శాకరుఁగోదండరామ సద్గురుఁదలఁతున్ ।
శ్రీకరు విప్రాకార। శ్రీకరునిన్ వేదశాస్త్రసిద్ధాంతనిధిన్ ॥౨౩॥

క॥ పికమధురోక్తుల చాడ్పున।
సుకవుల వాక్యములు కర్ణసుఖకరములగున్ ।
గుకవుల పలుకులు కాక।
ప్రకరరుతంబులును బోలెఁ బరుషంబులగున్ ॥౨౪॥

క॥ సామజము మీఁదఁగవిసిన।
దోమల చందమున సుకవితో వాదింపం।
గామెనసివచ్చు జడుల న।
నామతరుల ఖలులఁజూచి నవ్వరె సరసుల్ ॥౨౫॥

వ॥ అని యిష్టదేవతా నమస్కారప్రభృతి కృతిముఖ శుభాచారంబు లాచరించి నామనంబులోన.

సీ॥ భర్తృహరి యనఁదగిన భూభర్త నాఁడు।
భక్తిచే యోగిజన సార్వభౌముఁడగుచు।
నీతిశృంగార వైరాగ్యరీతు లమర।
వృత్తశతకత్రయము రచియించె మున్ను॥ ౨౬॥

క॥ వెలయం సుభాషితరత్నా। వళియన భర్తృహరియోగిపతి కృతివివిధో।
జ్జ్వలగుణశోభితమై సాం। ద్రులు గులుకు రసజ్ఞ కంఠభూషణ మగుచున్ ॥౨౭॥

సీ॥ అమ్మహాకృతి నీవు రమ్యాంధ్రదేశ। భాషచే సరసముగఁ గబ్బమురచించి।
మాకు సదుపాయనముగ సమర్పితంబు। సేయుము నితాంతభక్తి విశేషయుక్తి॥

గీ॥ సాఁపు సంగీతములకన్న శైలకన్య। భాషితంబులకన్నను బాహులేయ।
కథలకన్నను గర్ణసుఖప్రదములు। భక్తులర్పించు కావ్యగుంభనలుమాకు॥౨౮

వ॥ అని సర్వజ్ఞుం డాజ్ఞాపించి మనోరథసిద్ధి యగునని దీవించుటంజేసి యంత రంగంబునం దరంగితంబగు హర్షోత్కర్షంబునఁ గృతి రచియింపందొడంగి మదీయవంశావతారం బభివర్ణించెద॥ ౨౯॥ [సశేషము.]

మృచ్ఛకటికము, చతుర్థాంకము. (౫౬-పుట శేషము.)

విదూ—(ప్రవేశించి చూచి) ఆహాహా! ఈ వృక్షవాటికా సంబంధమగు రమణీయసంపద! ఆకులుం బూవులు వాక్కు తెలుఁగు గలవిగా ననేకవృక్షము లొక్కరొకం మొలపైచిరి! మరి, కొడలేని చెట్టుమొదళ్ళ యువతిజనులకు మొలబట్టిరొత్తిన నుయ్యాలలు గట్టిరి. ఆడవిమొల్ల, నల్లవావిలి, జాజి, మల్లె, పిరజాజి, గోరంట, గురువింద లోనగువాని కుసుమములు సువర్ణములై ప్రూధి తమంతనే రాల, దీని రామణీయకమునకు నందనవనమును దీసిపోవునదిగదా! ఇదిగో! ఇచ్చట నుదయ సూర్యసమప్రభములగు తెల్లదామరలును రక్తోత్పలములును దిగుడుబావిని సంజగొల్పెనుగదా! మరియు,

క॥ ఈయుదియశోకవృక్షం! బీయదనఁజిగిల్పుఁబూలు నెనయఁగఁగలనక్।
మేరొల్ల నెత్తమట్టిని! బూయుంపులఁజేరు సుభటుపోలికనమరెక॥

కానీ! అయితే మీయమ్మగారెక్కడ?

చేటి—చూపు క్రిందికిదింపు! అమ్మనుజూడుము!

విదూ—(చూచి చేరంజని) అమ్మా! నీకు క్షేమలగుంగాక!

వసం—ఓయీ! మైత్రేయుఁడుగారూ! (లేచి) కుశలమా మీకెల్ల! ఇదిగో ఆసనము! ఇందుఁగూర్చుండుఁడు!

విదూ—నీవు కూర్చుండవమ్మా! (ఇరువురును గూర్చుండిరి)

వసం—సార్థవాహపుత్రుని గారికిఁ గుశలమేగదా!

విదూ—అమ్మా! కుశలమే!

వసం—ఓ మైత్రేయుఁడుగారూ! ఇపుడొకమాట!

చ॥ ప్రణయము వేళ్ళుగా మొలిచి ప్రక్కలకొమ్మలుగా వినీతి, స
ద్గుణములు లేఁజివుళ్ళుగను గొప్పదనంబులు పుష్పరాశిగా
ధనఫలముల్ విదిర్పఁగనుదప్పని సాధుమహీజముల్ మహా
గుణతతి నాశ్రయించుఁగదుఁగూర్మి సుహృద్విహగాళి సర్వదా!

విదూ—(తనలో) ఎంతమూరమాలోచించినదిరా దుష్టవిలాసిని! (మైత్రే) కానేమి!

వసం—ఓయీ! నీరాక కేమిప్రయోజనము?

విదూ—అమ్మా! విను! పూజ్యులగు చారుదత్తుఁడుగారు చేతులు తలపైజోడించి మీతోనిట్లని విన్నవింపుమన్నారు.

వసం—(అంజలిపట్టి) వారియాజ్ఞయేమి!

విదూ—నీకు నాయందుఁగల విస్రంభమునుబట్టి నాదెగదా యనుకొని యాసువర్ణ భాండమును జూదములోఁ గోలుపోయితిని. సభికుఁడో రాజవార్తాహారియో, యెవరిచేతిలోఁ జిక్కెనో తెలియలేదు.

చేటి—అమ్మా! నీకు మంచికాలము లే! ఆయన జూదగాఁడు గూడనయ్యె!

వసం—(తనలో)ఏమీ! దొంగకుఁ జిక్కినదానిని మానరక్షణకొఱకై జూదములోఁ బెట్టితినని చెప్పిపుచ్చుట? కనుకనే ఆయనం గామించితిని.

విదూ—కావున దానికి మాఱుగా నిదె రత్నావళిని గైకొనుముగాక!

వసం—(తనలో) ఏమి! ఈయలంకారమును ధరించెదనా! (ఆలోచించి) అయితే ఎందులకు లే! పోనీ!

విదూ—అయితే ఏమమ్మా! ఈరత్నావళిని మీరుగొనరా?

వసం—(నవ్వి సఖీముఖమువైపు తిరిగి) మైత్రేయా! రత్నావళి నేలకైకొనును? ఎందులకు (అని ఆగ్రహించి ప్రక్కనిడికొని తనలో) పూలు పలచపడినను తీయ మామిడి మకరంద బిందువులను జిలుకదా? (పైకి) అయ్యా! నాపలుకులుగా నాజూదరి చారుదత్తునిగారితో నిట్లనివిన్నవింపుఁడు.—“నేనును బ్రదోషవేళను దమ్ము సందర్శింపవచ్చెద”నని.

విదూ—(తనలో) ఏమీ! అక్కడకేగి యింకొకటి తెచ్చుకొనునా! (పైకి) అమ్మా! అట్లే చెప్పెదను. (తనలో) అ! మాగణికా ప్రసంగములను మానుకొమ్మని చెప్పెదను.

వస:—చేటీ! ఈయలంకారమందుకొమ్ము: చారుదత్తునితో వేడ్కలుసల్పఁజనెదము.

చేటి—చూడుండి! చూడుండి! మింటుముసురుపట్టి దుర్దినముగాఁ జీకట్లు పడఁ జొచ్చెను!

క॥ ఉదయించునేని మేఘము। పొదవినను నిశల్ సువర్షముల్ గురిసిన రే।
నదిరొల్లనే గణింపను। హృదయముదయితాభిముఖత హెచ్చినవేళ౯॥

ఓసీ! హారముగొని వేళంబెరావే!

(అని యందఱు నిష్క్రమించిరి)

ఇది మదనికాశర్విలకమను చతుర్థాంకము.

[సశేషము.]

వా- వాసుదేవశాస్త్రి.

నెమలిని పక్షిరాజునుగాఁ జేయఁగోరుట.



పూర్వకాలమునం దొకసారి తమకు రాజు నేర్పఱుచు కొనుటకయి పక్షులన్నియు నొకచోటుసభ చేసి యెవరిని రాజునుగా నేర్పఱుచుకొందుమాయని యాలోచించుకొనుచుండెను. అప్పు డనేకపక్షులు వచ్చి పక్షిరాజాధిపత్యమునకు తామే యర్హులమని బయలుదేరి తమ తమసామర్థ్యములను సభవారిలోఁ జెప్పుకొనసాగెను. అప్పుడు నెమలి వారివద్దనిలిచి తన సౌందర్యమును వారికిఁజూపి, చిత్రవర్ణముగల పురివిప్పి వారియెదుట మనోహరముగా నృత్యముచేసి తన నాట్యకౌశలమును గనుపఱిచి, పక్షిరాజ్యమునకుఁ దన్ను పట్టముకట్టవలసినదని వారిని ప్రార్థించెను. ఆవన్నెలును చిన్నెలునుజూచి భ్రమించి విశేషసంఖ్యగల పక్షులు పక్షిరాజ్యమును నెమలికే యియ్యవలసినదని నిర్ధారణము చేసెను. అంత మంచిరాజు తమకు లభించినందునకై పరమానందమునొంది పక్షులన్నియు ఱెక్కలెగరవైచుచు రాజ్యాభిషేకమహోత్సవమునకయి ప్రయత్నించుచుండఁగా, ఆగుంపులోనుండి చిలుకయొక్కటి పయికివచ్చి స్వభావమనోహరమైన తన సుస్వరముతో సభవారి నుద్దేశించి యిట్లనియెను. "మీరందఱును జేరి యసమాన సౌందర్యముగల మయూరమును పక్షిరాజ్యాధిపతినిగాఁ జేయనిశ్చయించినందుకు నాకెంతో సంతోషముగానున్నది. ఐనను నామనస్సు నొక్క సందేహముమాత్రము బాధించుచున్నది. మనమిప్పు డీనెమలిని రాజునుగా నేర్పఱుచుకొని మన ధనప్రాణముల నీతనియధీనము చేయుచున్నాము. రాజువలనఁ గలుగవలసిన ముఖ్యఫలము ప్రజలరక్షణముగదా? ప్రజారక్షణము చేయలేని రాజుండుటవలన నేమియు ప్రయోజనము లేదు. రేపటినుండి డేగలు గృధ్రములు మొదలయిన క్రూరపక్షులు మనమీఁద దాడివెడలి మనలను సంహరించిభక్షింపమొదలుపెట్టినప్పుడు తానడ్డపడిమనప్రాణములు కాపాడఁగలుగునేమో యీరాజునడిగి మఱి పట్టాభిషేక మహోత్సవము నడుపవలెనని నాప్రార్థన." ఈ మాటలు విని పక్షులన్నియునొండొరుల మొగములు చూడమొదలుపెట్టెను. నెమలియుతగిన ప్రత్యుత్తరమును జెప్పఁజాలక క్రిందుచూచుచునూరకుండెను. అంతట పక్షులన్నియు తెలివితెచ్చుకొని నెమలికి పక్షిరాజ్యమిచ్చుట మానుకొనెను.

గీ॥ శక్తిచూడక బాహ్యవేషముల భ్రమసి
నరుల గౌరవార్హులఁగాఁగఁ బరిగణింత్రు;
కోటిపామరు లాడెడు మాటకన్నఁ
దెలివిగల మర్త్యుఁడొకఁడాడు పలుకు లెస్స.



ఒక తెలివిమాలిన దుప్పి.

ఒకనాఁడొకదుప్పి వేసవికాలములో మధ్యాహ్నవేళను చెఱువులో నీరుత్రాగుచు, తేటనీటిలో తనరూపమును జూచుకొని కొమ్ములయొక్క సౌందర్యమునకు మిక్కిలియాశ్చర్యపడి నీటిలోనిలుచుండి యిట్లాలోచించుచుండెను — "ఆహా! అనేకశాఖలతోఁగూడి యీకొమ్ము లెంతయాశ్చర్యకరముగా నున్నవి! ఇటువంటి చక్కని కొమ్ములున్నందుకు భగవంతుఁడు నాకీగడకఱ్ఱలవంటి పొడకాళ్ళను పెట్టక పొట్టికాళ్ళను పెట్టియున్న పక్షమున నావంటి చక్కనిజంతువు లోకములో మఱియొకటి యుండునా? అవివేకియైన దేవుఁడు నాకీలోపమును గలుగఁజేసినాఁడు" —అని యాలోచించుచుండఁగా, వేటగాఁడొకఁడును కొన్ని వేట కుక్కలును దుప్పికి నేత్రగోచరములయ్యెను. ఆదుప్పి కుక్కలనుజూచి భయపడి, నీరువెడలి వచ్చి కాళ్ళుజాడించి వాయువేగమున నరణ్యములోనికి పరుగెత్తి నిమిషములో నదృశ్యమయ్యెను. కాని,యడవిలో పరుగెత్తుచుండఁగా కొమ్ములు చెట్ల కొమ్మలలోను తీగెలలోను తగులుకొని పరుగెత్తలేక కుక్కలచేత పట్టుకోఁబడి ప్రాణములు విడుచుచు మరలనిట్లు చింతించెను—"అయ్యో! నేను పనికిమాలిన వనుకొన్న కాళ్ళేనా ప్రాణమురక్షించి క్షణకాలములో నన్నింతదూరము తెచ్చినవి; ఇంతలో నేనెంతో మెచ్చుకొన్న నాకొమ్ము లడ్డమువచ్చి నన్నిక్కడ నిలుపకపోయిన పక్షమున, కాళ్ళ సాహాయ్యమున నేను బ్రతికేపోదును." అనుకొనుచు ప్రాణములువిడిచెను.

గీ॥ బుద్ధిహీనులు కొందఱీపుడమియందు
నీశ్వరుని బుద్ధిమహిమంబు నెఱుఁగలేక
ఘనతలమనుకొంచు నీశ్వరాజ్ఞలనుమీఱి
దేవునపహసించుచుఁ గీడుతెచ్చుకొంద్రు.

ప్రభావతీప్రద్యుమ్నము, ప్రథమాశ్వాసము. (౬౪-పుట శేషము.)

ఉ॥ ఇచ్చకమాడుమాట లివియేల్ల నటుండఁగనిచ్చి నీకు నీ।
నెచ్చెలితోడుసుమ్ము సఖి నిక్కము చెప్పుము ప్రాంతనేర్పుగా।
కిచ్చెలువంబుగల్గు ఘనుఁడెక్కడఁ నేనాకఁడుండెనేని నేఁ।
డచ్చరణద్వయంబునకు దాస్యమొనర్పఁగనైన నర్హనే॥ ౧౪౩॥

వ॥ అనిమఱియుఁ జెక్కుచెందంబులం గంధర్వరాగంబు తేటపఱచుమాటలం దన బోటితోడం దడవు సంభాషింపుచుండె నవియుఁ బదిలంబుగాఁ దెలిసిన నమ్ముద్దియ ప్రద్యుమ్న శీఘ్రానయనంబునకు నుద్యోగంబు తద్దయుం జేయుట సంభావితంబు గావున దేవకార్యంబునకు నుపకారంబువోలెఁ దోఁచుచున్నదియని చెప్పుటయు నవహితమానసుండై యాకర్ణించి॥ ౧౪౪॥

శా॥ ధారుణ్యాభరణాయమాన బుధతాధారుండు భూమోల్లస।
త్కారుణ్యామృత శైత్యనిత్య దృగలంకారుండు నేత్రాంతగా।
హారుణ్యాంబర కల్పితారి మదసంహారుండు కీర్త్యంగనా।
తారుణ్యాంగళ నావధాభిజనవిస్తారుండు శూరుండనిన్॥ ౧౪౫॥

క॥ సారతర వైదికసమాచారుఁడు బహునృప కృతోపచారుఁడు నిరహం।
కారుఁడు సాంగానంగా। కారుఁడు సన్నుతవచఃప్రకారుఁడు సభలన్॥ ౧౪౬॥

కవిరాజవిరాజితము.

జలధిగభీరుఁడు శాంతవికారుఁడు శాస్త్రవిహారుఁడు సామనసా।
చలవరధీరుఁడు శశ్వదుదారుఁడు సంహృతవైరుఁడు శంభుపదా।
చలితవిచారుఁడు సాధిమసారుఁడు సత్పరివారుఁడు సర్వమతో।
జ్జ్వలగుణవారుఁడు సంవిదగారుఁడు సంశయదూరుఁడు సద్విభులన్॥ ౧౪౭॥

గద్య॥ ఇది నిఖిల సూరిలోకాంగీకార తరంగిత కవిత్వవైభవ పింగళి యమరనార్య తనూభవ సౌజన్యధేయ సూరయనామధేయ ప్రణీతంబైన ప్రభావతీప్రద్యుమ్నం బను మహాప్రబంధంబునందుఁ బ్రథమాశ్వాసము.

ప్రభావతీ ప్రద్యుమ్నము.

ద్వితీయాశ్వాసము.

క॥ శ్రీచణ గౌతమగోత్ర। ప్రాచీనామాత్య కీర్తిభామావిష్వ।
ధ్రీచీన గమన శక్త్యై।కాచార్యుఁడు సూరమంత్రి యమరార్యుఁడిలన్॥ ౧॥

వ॥ ఆసహస్రాక్షుం డపేక్షిత ప్రయోజనానుకూల్యంబుగాంచెను నా వెంటిరాయంచ యంచిత వచనరచనా విచక్షణత్వంబు చిత్తంబునకుం గ్రొత్త యింపుసొంపు సంపాదింపుచుం జెంపుమీఱ నింపులగు మెచ్చున చ్చెరువు నిచ్చలంబులై తనర నట్లనియె॥ ౨॥

సీ॥ శబ్దసంస్కార మెచ్చటను జాఱఁగనీక పదమైత్రి యర్థసంపదలఁ బొదలఁ।
దలఁపెల్ల నక్లిష్టతను బ్రదీపితముగాఁ బునరుక్తిదోషంబు పొంతఁబోక।
యాకాంక్షితసుపూర్తి యాచరింపుచును శాఖాచంక్రమక్రియ గడవఁజనక।
ప్రకృతార్థభావంబు పాడుకోనడుకుచు నుపపత్తియొందు నత్యూర్జితముగ।
నాకటఁ బూర్వోత్తరవిరోధ మొందకుండఁ। దత్తదవయవ వాక్యతాత్పర్యభేద।
ములు మహావాక్య తాత్పర్యమునకు నొనరఁ।బలుకనేర్పుటబహుతపఃఫలముగాదె॥ ౩॥

క॥ నీవెవ్వరి కొలఁదియఁగా। హో వరటామణి విహంగయోషవె భాషా।
ప్రావీణ్యము చూడఁగ వా।గ్దేవతవో కాక యాకె దిద్దినకవివో॥ ౪॥

క॥ అనుటయు రెండవపక్షం। బనిమిషవర తప్ప చెట్టియర్థమును దగు।
లోకానఁదివియక వెలివోని।చ్చునె బుధుఁడూహించిచేయు సుకవిత్వంబుల్॥ ౫॥

గీ॥ విను సురేంద్రపద్మజనిలేరు దిరుచు సా।రంధరాఖ్యుఁడగు మరాళవిభుని।
బిడ్డ నేను వాణి పెనుపంగఁ బెరిగి త।ద్విమలశిక్షఁ గంటి విద్యలెల్ల॥ ౬॥

వ॥ అని రాజహంసి తన పూర్వంబెఱింగించిన దేవేంద్రుండు దానం జేసి కాదే నీవింత సామర్థ్యంబునం బొలుపుమీఱుచున్న దానవు మీఁదికార్యంబునకుం బర్యాకులిత భావంబునం జేసి త్రోవగానక దీనతనున్న మాకు మాపాలి భాగ్యదేవత యీ విధంబున నిన్ను నన్నిటికి నాధారంబుగా ననుగ్రహించెంగావున దేవకార్యంబు కడముట్ట నిర్వహించుటకు నీవతక్క నొరులు నేరరిది యింతయు నెఱింగి యెంతయుం బ్రార్థించెద నంచబలగంబుతో నెప్పటియట్ల వజ్రపురంబునకరిగి కేలిదీర్ఘికల విహరింపుచుఁ బ్రభావతితోడి చెలిమికలిమికి నుపాయంబొనర్చి యమ్ముద్దియకుం బ్రద్యుమ్ననం దనురాగంబు బలియునట్లుగా వలయు తెఱంగున నతని గుణంబు లభివర్ణించి యాయిద్దఱకును శీఘ్రసంగమం బెవ్విధంబున నగునది నీవ యెఱింగి సంఘటింపుము॥ ౭॥

క॥ ఏనని పిఠి నని ద్వారవ।తీ నగరికేఁ బోయి వాసుదేవునితో నీ।
పూనిక సకలము చెప్పి న।పీనాదృతి నతని బుద్ధి వినిచన వలయున్॥ ౮॥
క॥ అని హంసంబుల నన్నిటిఁ। గనుఁగొని మీ రెల్ల దీని కార్యవిధికి న।
త్యనుకూలము లై రేఁత।ద్విని యోగము నడపవలయు దేవహితముగన్॥ ౯॥
గీ॥ అని యనుపమ రాశి యమరాశి కార్యంబు। నర్పఁ జనిరొ సురలు నమ్మి పొగడఁ।
బరిగణింప విశదపక్షపాతుల ప్రవ।ర్తనము లెట్లు నమ్మఁదగక యున్నె॥ ౧౦॥
వ॥ అది యట్లుండె నట్లు గదలి చని॥ ౧౧॥
గీ॥ అష్టమహిషీసమేతుఁడై యూలయోప। వనసరస్తీర మంటపవర్తి యైన।
కృష్ణదేవుదవ్వులన విలోకించి తెలిసి। యితఁ డెఱిఁగించు కొనవేళ యుదియయనుచు॥
క॥ తన యంచబలంగమ్ముఁ దా।నును శుచిహంఖి వభమువిగ్గి నూత్నవిలాసం।
బొనరించె సరోలక్ష్మికిఁ। గనకాంచితపక్ష చకచకద్యుతి చేతన్॥ ౧౩॥
వ॥ తదనంతరంబ తానాక్కతియు రక్కసులగొంగ చెంగటికి నల్లనల్లన నడచి॥ ౧౪॥
సీ॥ తోడ్తలు తలాడగానిడి రుక్మిణి భజింపఁ జడములొత్తుచు సత్యభామ కొలువ।
సురటి చేకొని భద్ర శుశ్రూష గావింప విరిచామరము మిత్రవింద యిడఁగఁ।
గాళింది పేక్కలోఁ గాళంజిఁ దాల్ప జాంబవతి తములపాకు మడిచి యొసఁగ।
గొడుగు పావలు కేలఁగొని నాగ్నజితియుండ జలములగిండి లక్షణ వహింపఁ।
గ్రొమ్మెఱుంగులతోడి కార్మొగులు వోలె। నొప్పు కృష్ణుని చేరువ నొప్పి హంసి।
నిండు వెలరేకిఁ దారకాన్వితనభంబు। పోలుపుఁ దెలిపెడి నైత్తమ్మికొలని కెలన॥ ౧౫॥
గీ॥ బెదరు లేకెట్లు మిక్కిలి గదియవచ్చి। యున్న తనదిట్టతనమున కువిద లెల్ల।
నరుదుపడఁ గృష్ణుఁ జూచి నన్నమరవిభుఁడు। పనిచె నీకొక్కమాట చెప్పంగ ననిరొ॥
వ॥ అని తదనంతరంబు॥ ౧౭॥
క॥ తన తనయుఁడు రాక్షసుపైఁ। జని పోదునని రుక్మిణికి నసమ్మతము గునో।
యనుశంకఁ జేసి హంసాం।గన రేకాంతంపు మాట గలదని పల్కెన్॥ ౧౮॥
క॥ పలికినఁ గమలావిభుఁ డా।పులుఁగుపడఁతి మాట నేర్పు బుద్ధికళాకా।
శలమును మెచ్చుచు నెంతయు। మొలకనగవు చెక్కుటద్దములఁ దళుకొత్తన్॥ ౧౯॥
చ॥ చెలువుగ భోజకన్య తొడఁ జేర్చిన మూర్ధము సత్యభామ యూ।
రులపయినున్న పాదములఁ బ్రోర్జితలీలఁ దెరల్చి లేచి యు।
జ్జ్వలనిజపాణిపద్మమున జాంబవతీకరనాగవల్లి కా।
దళములు పుచ్చుకొన్నఁ బ్రమదల్ప నిరండ్లుఁ గొంత దవ్వుగన్॥ ౨౦॥
గీ॥ ఇట్లు గోవిందుఁ డేకాంతమిచ్చి వినఁగ। హంసి తమ వజ్రపిలిపించు టాదిగాఁగ।

నచటికిఁ జనుచుంట యదగాఁగ నతని తమ వాచఃప్రసంగంబు నిరవశేషముగఁ జెప్పె॥
వ॥ ఇట్లు చెప్పిన॥ ౨౨॥
చ॥ వడుగులపల్కు పత్రుతిగ వారక మున్న సునిశ్చితత్వమున్।
బడసిన కార్యపద్ధతికిఁ బతీవధూవచనక్రమంబు చేఁ।
గడమ సమర్పితంబగుడుఁ గంజదళాక్షుఁడు సంతసిల్లె నే।
ర్పడియెను వజ్రనాభవధ భారవహుం డితఁడంచు నాత్మలోన్॥ ౨౩॥
వ॥ ఇట్లు సంతసిల్లి శుచిముఖికిట్లనియె॥ ౨౪॥
చ॥ బలవిభవాభిశోభితుఁ డభంగుర శౌర్యధురంధరుండు కా।
వలసిన మాయలు న్నిజవైరులకంటెఁ గరంబు నేర్చు నే।
పలుకుల చందమారయఁ బ్రభావతికిం బతిగాఁగలాఁడు ని।
శ్చలముగ రుక్మిణీసుతుఁడు చంపు నవశ్యము వజ్రనాభునిన్॥ ౨౫॥
క॥ ఆరాతిసుపట్టణ మె।వ్వారికిఁ జననుజ్ఞ లేక వైరమునఁ జొరం।
గారాదఁట ప్రద్యుమ్నుఁడె। వారణఁ దత్పురముఁ జొచ్చువైపు వినుమిఁకన్॥ ౨౬॥
సీ॥ భద్రాఖ్యుఁడగు నటప్రముఖుఁ డొక్కరుఁడు మున్నరుదెంచి మజ్జనకాధ్వరమున।
ననయంబుఁ గూడిన మునిసభం దననాట్యగరిమచే మెప్పించి వరముగాఁగ।
దనకవధ్యతయు సప్తద్వీపగమనంబు నాకాశగతియు నాట్యములయందు।
నెవ్వరిరూపు వహించె వారలయట్లు తానుభేదము లేక తనరుటయును।
బడసి యేడుదీవుల నాటపసనెరపుచుఁ। దిరుగుచున్నాఁడు వాని పైఁ దిరిసుతునకు।
వేడ్కఁ బుట్టంగఁ జెప్పియుఁ బ్రీవడుచొరఁగ। ముదలగొనుమాతఁ డైవచ్చు మదనుఁ డంత॥
వ॥ ఇది నీకుఁ బరమప్రయోజనంబు దీని నుపయోగింపఁదగిన యవాంతరకృత్యంబులుఁ దత్తదుపాయంబులు నీవరయుచుండుము పొమ్ము సురకార్యంబు నిర్వహింపుమని వీడుకొలిపినం దనమరాళజాలంబుతో జాలపాదవనిత గగనంబున నెగసి వజ్రపురంబున కభిముఖంబుగాఁ బ్రయాణంబు సలుపునప్పుడు ద్వారకానగర బాహ్యప్రదేశంబున వాహ్యాళి విహారసారస్యంబునం దగిలియున్న ప్రద్యుమ్నుండు॥ ౨౮॥
చ॥ తనహృదయంబు వెంబడిన తప్పక ఘోటకమంత నంత నే।
పనుపడ నిల్చి ముందటికిఁ బాఱి కెలంకులకుం దొలఁగి బా।
వెనుకకు నేగుదెంచి కడువేడ్క యొనర్పఁగ బంతియాడ నా।
న్మిని గనకంపుఁగోల నడిమింటనె త్రిమ్మరఁ బారి కొట్టుచున్॥ ౨౯॥
వ॥ మఱియును॥ ౩౦॥
చ॥ ఎగరఁగ వైచి కొట్టు టది యెంతభరంబని బంతియుగ్రగా।

మిగ వడిఁజాఱ నైచి పురికింబడనీక నెుఱ వానిమీఁదఁ బి।
త్రిగతి హయంబుఁ దోలుచును గ్రమ్మఱ మీఁదికిఁ గొట్టియాడ విం।
తగఁ దనచేతి రత్నమయదండము కాంతులు గాడిపాఱఁగన్॥ ౩౧॥

వ॥ వెండియు నతండు మండలగతుల నతులంబుగాఁ దురంగంబుఁ దోలియాడె నప్పుడు॥ ౩౨॥

సీ॥ తొలుగొల్త నద్యేక తురగంబుమండల గతిచారియగుచు నిక్కంబుతోఁచె।
నావెనుకను సరూపాశ్వాలిచెదరక చక్రీకృతిని బర్వసరణితోఁచె।
నంతట ననతిస్ఫుటావయవంబుగా నైనసరియేకాంగ వేష్టనతతోఁచెఁ।
దుదఁ దద్విభూషణ ద్యుతిరాజమాత్రంబు కొఱవిత్రిప్పినరీతి మెఱసితోఁచె।
నంతకంతకు గతివేగమగ్గలింప। రాఁగవాగె రెుచ్చరికపరాకుజయ్య।
యనుజనులు తిచ్చవడి తమపని మఱవఁగఁ। బరగునమ్మేటి వెఱరౌతుప్రౌఢికతన॥

చ॥ ఉరుజవశాలి యుత్తురగముల్మకచక్ర నయావలంబురై।
తిరుగు రయంబుచేత నెడత్రెవ్వక కుమ్మరిసారె చాడ్పునన్।
బరగెఁగదన్ ఘృతాభినవభాండతతుం దగనున్కిపట్టు దాఁ।
దరలక మైని దద్భ్రమణవందగతిన్ హరిపుత్రుఁ డొప్పఁగన్॥ ౩౪॥

వ॥ అతఁ డంత॥ ౩౫॥

క॥ వల్గితముఖ గతిపంచక। వల్గువిహారముల సైంధవము నలయించెన్।
వల్గావిభాగకుశలత। వల్గత్కుండలమరీచి వల్లరు లెసఁగన్॥ ౩౬॥

శా॥ నానావీథిగతిప్రభేద విహృతిన్ సంతృప్తుఁడై కంతుఁడిం।
పూనన్ వాగె గుదించినన్ బురుష కప్రోన్నమ్రపూర్వాంగమై।
కానంగాఁబడియెన్ మరుజ్జవనమా గంధర్వమర్త్యాశ్వ సం।
తానస్పర్థను మిన్నుప్రాకెడుక్రియన్ దానెంతయుం జూడ్కికిన్॥ ౩౭॥

సీ॥ సముపలాలనయుత స్కంధాంతికాస్ఫాల దమితవేగో మహోద్ధత్యకంబు।
దంతాళికా నియంత్రణసమున్నామితా కుంచితగ్రీవా సమంచితంబు।
దందన్యమాన శబ్దాయమానఖలీన కవణదుర్ఘుర్ఘురిత సృక్వద్వయంబు।
ఘనఘర్మ డిండీర ఖండపాండురిత పల్యయనవర్ధోభయప్రాంతకంబు।
నగుహయముడిగ్గెఁ బ్రద్యుమ్నుఁడంకవన్నె। రెుకటిసాహిణి యవ్వల నూఁదిపట్టెఁ।
దనయనుఁగుచెలికాఁడుకై దండనొసఁగఁ। బ్రజసురాళించిమణులువస్త్రములుపైవ॥

గీ॥ అపుడు గగనసరణి నరిగెడుశుచిముఖి। యతనిఁజూచి యుల్ల మతఁడితండ।
కావలయునవశ్య మీవరపురుషుతో। మాటలాడిచనుట మనకుమేలు॥ ౩౮॥

క॥ అనియాప్రద్యుమ్నునకుఁ । వినఁబడునట్లుగ మరాళవితతులతోఁ బ ।
ల్కి నిజోక్తి కతఁడు వెఱఁగం । దనయంబున నవియుఁ దాను ధరణికిడిగ్గెన్ ॥ ౪౦॥
సీ॥ మరునశ్వగతి మెచ్చి సురలు పైఁ జిదిన పైఁడివాగ్రేఁత క్రొమ్ముడుఁగు దువ్వలువ లనఁగ ।
దర్పకు నెఱరాతుతనము కేర్చికిఁ గ్రమ్ముకొను సతేజః కీర్తిఘనములనఁగ ।
హయఫేన ధావళ్య యూద్నార్థమై ద్రాలు తటిదనుగత సితాబ్దంబులనఁగ ।
వాజివిభ్రమ జితావర్తతదోలఁకు దివ్యలయేటిసాబ్జరేణూర్ములనఁగ ।
గనకరేఖలతోడి తెక్కలబెడంగు । చూపఱకుఁ గనుపండువై సొంపుమీఱ ।
జలదపథమున నుండి భూస్థలికిడిగ్గి । హంసములు వర్ణనాసీమ నతికరించె॥ ౪౧॥
సీ॥ ఇట్లుగన్పట్టు మనేలెంచియుంచలు వసుధ చేరువ నేటవాలుగాఁగ ।
నతినిశ్చలప్రసారిత పత్త్రంబులై డిగుచుఁ గామునిముందటికినిగొంత ।
సరిగడవఁగఁ జాతి మరలి బోరలు వెట్టిగిల నొక్కకడవంచి మలపుదిరిగి ।
యొఱకలంతట రెండు నెఱయఁ జక్కఁగఁ జాచియవనిఁ గాల్మోపి తెక్కాక్కచ్చముడిచి ।
మొగములొకవింత యొయ్యారముగ మలంచి ।
యూఁకను విదిర్చికొనుచు నొక్కింతతడవు ।
హైమరేఖావిచిత్ర నిజాంగరుహాలి ।
నిర్మలతఁ జూడ్కులకు నింపు నింపుచుండె॥ ౪౨॥
వ॥ అంతఁ బ్రద్యుమ్నుఁ డుదోద్యతమాన కౌతుకంబున వానినుపలక్షించి పతీవరులారా తొలుతనితనితో మాటలాడవలయు ననుకొంటి రిచ్చట నెవ్వనితో నేమిమాట లాడవలయు నతనిం బిలిచి సంభాషింపుఁ డెట్టిప్రయోజనంబున నెందుఁబోవుచున్న వారలో మీరలన్యోన్యపరోధంబునం గార్యవిరోధంబు సైరించి యుండరుగదా యను శంకచేత సంకోచంబు లేక వేసిరించి యీగతిఁ బలుకవలసెఁగాని భవదీయ సన్నిధాన సౌభాగ్యంబునం దనిసికాదు మీరూపచేష్టా వచోవిశేషంబులరయ దివ్యజాతిపక్షులరుగాని ప్రకృతిహంసంబులు గారనుటయును నంత శుచిముఖి యఖిలజన మనోహరంబైన మధురస్వరంబున నిట్లనియె॥ ౪౩॥
ఉ॥ ఇచ్చట మేము వేఱ మఱియెవ్వరితోడను మాటలాడఁగా ।
వచ్చెద మచ్యుతాత్మజ వివస్వతిపంపునఁ గృష్ణుపాలికి ।
న్వచ్చి యతండుపీడ్కొలుప వారలయిద్దఱ యాజ్ఞలుఁ గడుఁ ।
హెచ్చరికన్ ధరించి యిపుడేగెదు లాగితియొక్కచోటికిన్ ॥ ౪౪॥
ఉ॥ ఇప్పుడు నిన్నుఁ జూచి కొలువించుక చేయ కతిక్రమించిపో ।
నొప్పదటంచు వచ్చితిమి యోగ్యసమర్హణ మాను వెంతయున్ ।

దప్పఁగదయ్య యాదవవతంస నినుంగని నీయనుగ్రహం।
బొప్పఁగఁగాంచి పోవుట ప్రయోజనసిద్ధికి మూలమారయన్॥ ౪౫॥

క॥ నీపలికినట్ల యేము సు।రాపగఁ గ్రీడించు దివ్యహంసములము నీ।
చూపునకుఁ దప్పఁగలదే । యేపట్టునవైనఁ బంకజేక్షణతనయా॥ ౪౬॥

వ॥ ఏము కాశ్యపులము మమ్ము నింద్రుండును మీతండ్రి యుపేంద్రుండును నిజపరివారంబులోనివారిఁగా విచారించి యారీతిఁ బనిపంచి నడుపుకొనుచున్నవారు వారి జాతునకు దక్షిణభుజాదండంబునుం బోలె నఖిలకార్యంబులందు నత్యంత ధురంధరత్వంబు వహించి యున్నవాఁడవు గావున మావిధంబు నీకు విన్నవించుకొంటి మెల్లపట్టునం దృష్టిఁ బెట్టుకొని యుండునది యేము పోయివచ్చెదమనినఁ బ్రద్యుమ్నుం డిట్లనియె॥ ౪౭॥

సీ॥ మీరుపోయెడికార్య మెవ్వారలకును। జెప్పరాదేమొ పోనిమ్ము చెప్పుమొకటి।
యల్లయతఁడితఁడనుకొంటి రాదినైచట।నాప్రసంగంబు రాఁగారణంబు గలిగె॥ ౪౮॥

క॥ అదియును జెప్పఁగవచ్చిన। యదిరైన నాకింతవడి ప్రయాణత్వరయున్।
గుదియింప వచ్చునేనిన్। బదరక నిమిషంబునిలిచి భాషింపఁదగున్॥ ౪౯॥

చ॥ అనుడు రహస్యమైనదిరొ యౌను భవత్పరిపృష్టమెంతయున్।
జనక నిమేషమం దదయ సంగతిగాదనుమాకునైన నీ।
వనఁగ జనార్దనుం డనఁగ నారయ భేదము లేదు కావునన్।
విను వినిపింతు మాపనియు నీకుప్రసంగము మున్నకల్మియున్॥ ౫౦॥

వ॥ అని శుచిముఖి యిట్టట్టుపలుకఁ గొండెనలువంకలు బాఱఁజూచుటయు నాచూపు వెంటనె శంబరాంతకుచూపు దీపికైకాంత కాంతుం బగుచుం జరఁగినఁ బరిజన సమానంబుగా మానసీయులు నాయనయున్నచోటికిఁ గదుపెడ గలుగఁదొలంగి చనిరంత నంతఁ గంతునభివీక్షించి యంచచెలువ చెలువంపుఁ జెలువు గులుకు కలికిపలుకుల కలకలత్వంబు వీనుల కపూర్వపర్వంబగుచుఁ బర్వుచుండ నిట్లనియె॥

క॥ వినవయ్య వజ్రనాభుం। డనిరొడు నాకదైత్యుఁ జంప యత్నము సతతం।
బును నడచుచున్న యది బహు।దినములనుండియును హరికి దేవేంద్రునకున్॥

క॥ తమకంటె మున్నవాఁడే। తమమీఁదట నేమికీడుదలఁచునో యనుచున్।
మమువారు వేగుపంపఁగ। నమరాహితు పీటికెప్ప చరిగెద మనఘా॥ ౫౩॥

వ॥ అనినవిని యతండు॥ ౫౩॥

క॥ కటకట మనవారిది దుర్ఘటముగఁ గొని యెంతచింత గావించెద రె।
ప్పటికింక నేము మే మెం।తటిపగయును డిగ్పలేమె తమయాజ్ఞపనన్॥ ౫౪॥

క॥ ఆకట తపమహిమ తారెటుఁ|గాకయొ మఱిరేలొ తెగరుగాక మరుత్కం|
టకుఁ దీఁచె మదంచనైన|న్నాకనినె పంపినను దమనిరోగము బలిమిన్॥ ౫౬॥

వ॥ అనుడు శుచిముఖి మెచ్చి నచ్చెరువు నిరవుకొన నతనిం జూచి యిట్లనియె॥ ౫౭॥

చ॥ భీమరథరుండుఁ జక్రియును బెట్టుగ దీర్ఘవిచారమింత చే|
యుచురఁట దైత్యుఁ డెంతబలియుండొ కదా యని కోఁచవాఱకే|
ట్లుమటున వానిఁ ద్రుంతు ననునొక్కనిబంపిన నంటి చాలదే|
యిది నెరవైన బంటుతన మిట్టిది నీకి తగుం గుమారకా॥ ౫౮॥

ఉ॥ కయ్యపు వేడ్క లేఁచుకొని క్రమ్మెడతమ్మెదిరించి రేమియున్|
డయ్యక కాఁతసేపు మెమధాకను జేతులకాఁటినిల్పు వాఁ|
డెవ్వెఁడఁ బోటుబంటునకు నెఁతయుఁ గౌతుకకారిగాఁడె నీ|
వయ్యసురేంద్రుతోడి యనికానసరెయొనర్చుట యుక్తమెన్నఁగన్॥ ౫౯॥

గీ॥ తమకుఁదామె ప్రల్లదంబునఁ బనిలేని| కయ్యమునకుఁ జనరుగాని తగిన|
దురములైనఁ దివురుదురు తమయంతన| పిలిచికొండ లేని బిరుసుమగలు॥ ౬౦॥

వ॥ అదియట్లుండె నింక నీప్రసంగంబు మున్నవచ్చిన తెఱంగును విన్నవించెద వినుము॥

ఉ॥ ఇంతకమున్న వజ్రపురి కేఁగుచునుండుదుమేము గావునన్|
గాంతతరాంగి నద్దనుజకన్యక నేనొకనాఁడు గంటి శు|
ద్ధాంతరసప్రకాండ సముదంచిత కేళిఁ జరింపుచుండి త|
త్ప్రాంత లతాగృహంబున వయస్యయుఁ దానును ముచ్చటాడఁగన్॥ ౬౧॥

క॥ తిర్యగ్వనితను నన్నున|మర్యాదానందమగ్న మతిఁ జేసె మహా|
శ్చర్యముగఁ దద్వధూసౌం|దర్యం బెట్టిదని చెప్ప నలినాతసుతా॥ ౬౨॥

సీ॥ నెత్తమ్ములనుచుఁ గ్రొన్నెలలంచు వటఫలశ్రీలంచు తాఁబేటిదిప్పలనుచు|
నమ్ముల పొదులంచు ననఁటికంబములంచుఁ బులినమంచును సుడిచెలువమనుచు|
హరిమధ్యమంబంచు హైమకుంభములంచు నవమృణాళములంచుఁ జివురులంచు|
మదనుశంఖమటంచు మణిదర్పణములంచుఁ బగడమంచును దిలప్రసవమనుచు|
శఫరులనుచు సింగిణులంచుఁ జంద్రఖండ|మనుచు శ్రీకారములటంచు నళులటంచు|
నిట్టిపగిదయ్య చెప్పఁబోయిన నుపమలు| వీనిఁ దడవ నీగ్గోదవు నక్కోవలఁ దినెంచి॥

గీ॥ చామరంబులు వెనుకకుఁ జనుటనీల| రత్నములు పూరిఁగఱచుట భ్రమరకమని|
లేఁటిబిడ్డ పేరిపట యాతెఱవకురుల| కధికనీలిమనోదీప్తి హారితనూజ॥ ౬౩॥

[సశేషము.] పింగళి-సూరన్న.

ఆంధ్రకవులచరిత్రము, మధ్యకవులు. [౮౦-పుట శేషము.]

ఏదియెట్లున్నను గృష్ణదేవరాయనికిఁ బూర్వకాలమునందలి కవులు రచించిన యీ భరి గ్రంథము లన్నియు సంస్కృతమునుండి చేసిన భాషాంతరములే కాని స్వబుద్ధికల్పితముగా రచించిన నూతనగ్రంథ మం దొక్కటియుం గానరాదు. తెలుఁగునందు నూతనముగాఁ బ్రబంధరచన చేసి తరువాతివారికి దారిచూపినవాఁడు కృష్ణదేవరాయని యాస్థానకవియైన యల్లసాని పెద్దనామాత్యుఁడు. అతఁడు రచియించిన మొదటి ప్రబంధము స్వారోచిషమనుసంభవమను మనుచరిత్రము. ఈగ్రంథమునందలి కథ మార్కండేయ పురాణమునుండి గ్రహింపఁబడినది. మొట్టమొదట నీమనుచరిత్రమును బ్రబంధరూపమున రచింపఁబట్టియే పెద్దనార్యున కాంధ్రకవితాపితామహుఁడను బిరుదనామము కలిగినది.

కృష్ణదేవరాయలకు సంస్కృతాంధ్రములయం దసాధారణపాండిత్యము గలిగి యుండుట నాతఁడు రచియించిన యాముక్తమాల్యదయే సహస్రముఖముల ఘోషించుచున్నది. ఆముక్తమాల్యద కృష్ణరాయకృతము కాదనియు దానిని తదాస్థానకవియైన పెద్దనార్యుఁడు రచియించి పుస్తకమునఁ దనప్రభువునకుఁ గర్తృత్వము నారోపించెననియు వాదుకగలదుగాని యది యంతగా విశ్వాసనీయముగాదు. కృష్ణదేవరాయ లల్లసాని పెద్దనను, రామరాజభూషణుని, ప్రబంధములను రచియించి తెమ్మని యాజ్ఞాపించెననియు, తదాజ్ఞానుసారముగా వారిరువురును గ్రంథరచన చేసి తమ ప్రబంధములనుదీసికొని రాఁగాఁజూచి రాజు వసుచరిత్రమునకంటె మనుచరిత్రము లేఁతపాకమునఁబడినదని యభిప్రాయము తెలిపెననియు, అందుమీఁద పెద్దన "యాముక్తమాల్యద" యనుపేర విష్ణుచిత్తుని చరిత్రమును రచియించి తీసికొనిరాఁగా విష్ణుచిత్తీయము ముదురుపాకముగా నున్నదనియెననియు, చెప్పుదురుగాని యిదియంతయు నిటీవలివారి స్వకపోలకల్పితము. వసుచరిత్రమును రచియించిన రామరాజభూషణుఁడు కృష్ణదేవరాయని కాలమునం దుండెనో లేఁడోయని సందేహింపవలసియున్నది. ఉండినపక్షమున నతఁ డాకాలమునఁ జిన్నవయసువాఁడయి యుండవచ్చును. ఆముక్తమాల్యదయు మనుచరిత్రమును రచియింపఁబడినతరువాత నేఁబది యేండ్లకుఁగాని రామరాజభూషణుఁడు వసుచరిత్రమును రచియింపలేదు. కాఁబట్టి పయి కథ యెంతమాత్రమును నమ్మఁదగినది కాదు. ఆముక్తమాల్యదకును, మనుచరిత్రమునకును, శైలియందు విశేషభేద ముండుట చేతను, ఆముక్తమాల్యద వ్యాకరణదోషయుక్తమయినదిగా నుండుట చేతను, ఆరెండుపుస్తకములు నేకకవిచే రచియింపఁబడినవి కావని నిశ్చయముగాఁ జెప్పవచ్చును. పెద్దనకవిత్వములో లేని యికార సం

ధులును, తత్సమశబ్దములం దకారసంధులును, క్త్వార్థకసంధులును, ఆముక్తమాల్యద యందుఁ గానఁబడుచున్నవి. అందుఁ గొన్నిటి నిందుక్రిందఁ జూపుచున్నాము:—

ఇకారసంధులు.

౧. సీ॥నింగిటుత్రిశంకుకతనమాతంగవాటి।యయ్యోనిఁకనుండఁదగదనియవనికరిగి।
నట్టినతుత్రతారాగ్రహాళియనఁగఁ।గాంతనవరత్నరాసులంగళ్ళఁబోలుచు॥—ఆ.౨.

ఇందు మొదటిపాదమునందు "నింగి+ఇటు=నింగిటు" అని ప్రయోగింపఁబడినది.

౨.—చ॥ హతలనొనర్చె మోహితల నల్ల యయోముఖి నాపులస్త్య భూ।
సుతను విరూపలౌట ననుచో ముసలి న్పెద నిట్టతాడువం।
టతివరమించెఁ దాముసలియయ్య రహి న్మఱుగుజ్జ త్రేవ్యకై।
ధృతిచెడి యుగ్రసేనునకుఁ ద్రేవ్యతనొందియు విద్ధియేలఁడే॥—ఆ.౫.

ఇందు మూడవపాదమునందు "నిట్టతాడువంటి + అతివ= నిట్టతాడువంటతివ" అని ప్రయోగింపఁబడినది.

తత్సమములం దకారసంధులు.

౧.—చ॥ అడుగుననుండియుం బదిలమై చదలంటెడు కోటనొప్పు ప్రో।
ల్పెడని కడంకదంచెనపుఁ జేతులఁ గంగను తానెదూఱఁగా।
నడుమనె యున్కిఁ జేసి యల నాకపురి న్సరికై పెనంగి లా।
పెడలఁగఁ బట్టి త్రేయుటకు నైతెననంబను మల్లుపోరునన్॥—ఆ. ౨.

ఇచ్చట రెండవచరణమున "గంగ+అను=గంగను" అని ప్రయోగింపఁబడినది.

౨.—చ॥ తడితలడిగ్గి ముంప జడతం దుడతెప్పలఁ గన్నువిప్పి పు।
ల్పొడుచుచు నీరుముంగరల పోలికమున్కులఁ గూడనోటఁ గొం।
తొడియుచు గూఁటికర్లి సగమెత్తుచు తెక్కవిదిర్చు మున్నుగా।
వడఁకుచు కాక చేష్టుడిగె పక్షముపక్షులు జానువుల్ చారన్॥—ఆ.౪.

ఇచట నాలవచరణమందు "చేష్ట+ఉడిగె=చేష్టుడిగె" అని ప్రయోగింపఁబడినది.

౩.—శా॥ ఆబ్రహ్మణ్యము లోనవైచుకొనె నన్యాయంబున న్మత్సుతం।
దాబ్రహ్మాదుల మీరనిల్పియుఁ బ్రభుత్వంబూఁదియుం ద్రోఁచురే।
యీబ్రక్కం ద్విజుఁ జూడరయ్య సభవారీ రంగభర్తంచు దుః।
ఖాబ్రాశింబడి బావ్కకంతుఁడు సముద్యద్దోఃఫలాలుండునై॥—ఆ.౬.

ఇచట మూడవచరణమున "రంగభర్త+అంచు=రంగభర్తంచు" అని ప్రయోగింపఁబడినది.

క్త్వార్థకసంధి.

౧.—సీ॥ కొంగవాల్గులుకు లంగుకొలఁబట్టుక జబ్బలంటఁగుట్టిడ వెజ్జనరయువాడు।

తలఁబడ్డ గుదియదెబ్బలఁ బాఁతమసీయుడి యంబలిగంజిఁడ్ల నడుగువారు।
తమ నేగిఁ జెప్ప లోఁదయమీఱ విని చీరఁ జించిచ్చువారి దీవించువారు।
నోలఁబడ్డ నైపమునఁ గలలేనిసేరిఁ జెప్పి చుట్టలపై దాఁచిపెట్టువారు।
నైనపాంథుల చేతఁ గ్రుంకైనయూళ్ళ। జాడగానఁటఁ దెచ్చి యున్నిఁడడి చి।
వారునీరానఁబోవనొవ్వారిమగిడి।వచ్చునాలోననీరూపువచ్చె నాకు॥-అ.౬.

ఇచ్చట నూఁటవపద్యమునందు "చించి+ఇచ్చు=చించిచ్చు" అని ప్రయోగింపఁబడినది. మఱియు నీపద్యమునందే మొదటిచరణమున "పట్టుకొని"యనుటకు "పట్టుక" యనియు, రెండవచరణమందు "గంజి+ఇండ్ల=గంజిఁడ్ల" ననియు, వ్యాకరణదుష్టములయిన ప్రయోగములున్నవి. ఈవిధముగానే,

శా॥ ఎట్టూయిట్టగునయ్యపల్కు వయులే కిన్నాళ్ళు నీకూడె యూ।
పొట్టం జెట్టి మహోఘలబ్ధిఁ దనువుం బోషించి యున్నాళ్ళకే।
నెట్టే నొక్కతపస్వి యొక్కఁ ద్రవతిరాఁడే చూడఁడే తత్కృపన్।
బుట్టున్నీగెద దీని నానాదవి యోషిత్త్వాత్మ యెట్లంటివే॥—అ. ౬.

"పుట్టున్నీగెద" (పుట్టున్+ఈగెద) మొదలయిన వ్యాకరణవిరుద్ధములైన ప్రయోగములు మఱికొన్ని యందందుఁ గానవచ్చుచున్నవి. కాఁబట్టి యీ యాముక్తమాల్యద సర్వలక్షణవేత్తయయిన యల్లసాని పెద్దన విరచితము కాదనుట స్పష్టము. అంతేకాక యీపుస్తకము పెద్దన కవనమువలె మృదువైనదియు నల్లికగలదియుఁ గాక కటుపదభూయిష్ఠముగా నున్నందునను పెద్దనార్యకృతము కాదని నిశ్చయింప వలసియున్నది. అయినను కృత్యాద్యవస్థయందు వంశావళిలో పెద్దనప్రణీతమయిన మనుచరిత్రములోని పద్యములే యిందుఁ గానఁబడుచున్నందున రెంటికిని గృతికర్త లొక్కరేయని యూహింపవలసియుండుననికొందఱందురుగాని యాయూహ సరియైనది కాదు. వంశావళిలో కృష్ణదేవరాయని జయములును గుణవర్ణనలును మాత్రమే యధికముగా నున్నందున, ఆత్మస్తుతిని దనపద్యములతోఁ జేసికొనుట కిష్టములేనివాఁడయి కృష్ణదేవరాయలు ప్రథమపురుషములను మధ్యమపురుషములనుగామార్చి వేంకటేశ్వరుఁడు తన్నుఁగూర్చి పలికినట్లుగా మనుచరిత్రములోని పద్యములనే తన యాముక్తమాల్యదయందు వేసికొనియుండును. అయినను విష్ణుచిత్తీయమునందుముఖ్యముగా నయిదవ యాఱవ యాశ్వాసములయందు పెద్దన పద్యములవంటి "యల్లికజిగిబిగి"గల పద్యములును, నంది తిమ్మన్న పద్యములవంటి "ముద్దుపలుకులు"గల పద్యములును పెక్కులు కానఁబడుచున్నందునఁ గృష్ణదేవరాయలు తన యాస్థానకవీశ్వరులయినవారి సాహాయ్యమును స్వగ్రంథరచనమునందుఁ బొందియుండును. ఒక్క సాహాయ్యమే యననేల? అయిరువురు కవులును ముఖ్యముగా నాంధ్రకవితా పితా

మహాంధ్రుఁడని పేరొందిన యల్లసానిపెద్దనయు రచించినపద్యములే పెక్కు లాముక్తమాల్యదయం దున్నట్లు కానఁబడుచున్నది. ఆంతమాత్రముచేత గ్రంథ కర్తృత్వమును వారికారోపించుట వలనుపడదు. గ్రంథమును రాజే చేయఁగా తదాస్థానకవులు కొన్ని పద్యములను మార్చియు, కొన్నిపద్యములను తమవి చేర్చియు, నుందురు. కృతికర్త కృష్ణదేవరాయలనుట కాశ్వాసాంతములందును కృత్యాదియందును జెప్పఁబడుట మాత్రమే కాక "పలికితు శ్రీష్ఠోత్తమల" నిత్యాది పద్యములో నుదాహరింపఁబడిన తద్రచిత గ్రంథనామములును తత్కర్తృత్వమును స్థాపించుచున్నవి.

ఈకృష్ణరాయలు కవిత్వమునందు సమర్థుఁడని యాతని కాలమునం దాముక్తమాల్యదను రచించుటకు ముందే యాతని యాస్థానకవులు చెప్పియుండుట కూడ విష్ణుచిత్తీయము కృష్ణరాయ కృతమగుటను స్థిరీకరించుచున్నది. ఈ రాజు కవిత్వమునందు నిపుణుఁడనుటను సూచించుచు రాజునకార్పి "కవితాప్రావీణ్యఫణీశ" యను విశేషణము నుపయోగించిన పారిజాతాపహరణములోని నంది తిమ్మనార్యుని పద్యము నొకదాని నిందుక్రిందఁ బొందుపఱుచుచున్నాము:—

క॥ శ్రీ వేంకటగిరి వల్లభ। సేవాపరతంత్రహృదయ చిన్నమదేవీ।
జీవిత నాయక కవితా। ప్రావీణ్యఫణీశ కృష్ణరాయమహీశా॥—అ. ౪.

అక్కడక్కడ వ్యాకరణస్ఖాలిత్యములున్నను కటువుగానున్నను మొత్తముమీఁద విష్ణుచిత్తీయముయొక్క కవిత్వము మిక్కిలి ప్రౌఢముగాను, అర్థగాంభీర్యము కలదిగాను, అలంకారబహుళమును స్వభావవర్ణనలు కలదిగాను, ఉన్నది. అందుచేతనే శేషశకటరేఫముల నిమిత్తమై పెనఁగులాడిన యప్పకవివంటివాఁడు సహితము యతిప్రాసములయందు ద్విరేఫమైత్రి నంగీకరించిన యీకవి గ్రంథమును గుణబాహుళ్యమునుబట్టి లాక్షణికమైన దానినిగా నంగీకరించి తన లక్షణగ్రంథమునం దాముక్తమాల్యదనుండి పద్యములను లక్ష్యములనుగాఁ దీసికొనియున్నాఁడు.

తాను పూర్వము దిగ్విజయయాత్రకు వెడలి బెజవాడయందుఁ గొన్నిదినములుండి కృష్ణామండలములోని శ్రీకాకుళమునందలి యాంధ్రవిష్ణుదేవుని సేవింపఁబోయిన హరివాసరము నాటి రాత్రి యాదేవుఁడు స్వప్నములోఁ దోఁచి వేంకటేశ్వరుని కంకితముగాఁ దెనుఁగు గ్రంథమును జేయుమనఁగా విష్ణుచిత్తీయమును రచియించినట్లు కవి తన గ్రంథమునం దీక్రిందివచనములతోఁ జెప్పియున్నాఁడు—

"......కళింగదేశ విజిగీషామనీషం దండెత్తిపోయి విజయవాటిం గొన్నివాసరంబులుండి శ్రీకాకుళ నికేతనుండగు నాంధ్ర మధుమథను సేవింపంబోయి హరివాసరోపవాసం బచ్చటఁ గావింప నప్పుణ్యరాత్రి చతుర్థయామంబున॥

* * * * * *

సీ॥ తెలుఁగదేలయన్న దేశంబు తెలుఁగేను। తెలుఁగువల్లభుండఁ దెలుఁగొకండ।
యెల్ల నృపులుఁ గొలువ నెఱుఁగవే బాసాడి। దేశభాషలందుఁ దెలుఁగు లెస్స॥

క॥ అంకిత మోయన నీకల। వేంకటపతి యిష్టమైన వేల్పగుటఁ దదీ।
యాంకితము చేయు మొక్కఁక। సంకేతము కాక తఁడె రసజ్ఞేఁ గానే॥"

కళింగదేశ విజయయాత్రకయి వెడలి విజయవాటి(బెజవాడ)కి వచ్చినది హూణశకము ౧౫౧౫వ సంవత్సర మగుటచేత నీగ్రంథము నాసంవత్సరమునందుఁ జేయనుద్దేశించి ప్రారంభించియుండును. అయినను వెనుక నుదాహరించిన యుపోద్ఘాతములోని "అలుకన్ ఘోటక" ఇత్యాదిపద్యమునందు వర్ణింపఁబడిన (౧౫౨౦వ సంవత్సరమునందు జరగిన) యేడిల్ఖానుని జయించిన వర్ణన మిందుండుటనుబట్టి యీగ్రంథము ౧౫౨౦వ సంవత్సరమువఱకును ముగింపఁబడలేదు. ఈపుస్తకమునందలి పద్యములు మొత్తముమీఁద శ్రుతికటువులుగా నున్నను, పెక్కుపద్యము లర్థగాంభీర్యము కలవిగా నుండుటయే కాక మృదుమధుర పదగుంభితములయి కూడ నున్నవి. కవియొక్క ప్రౌఢిమయు కవనసైపుణ్యమును దెలియుటకయి కొన్నిపద్యముల నిందుదాహరించుచున్నాను:—

౧. మ॥ శయపూజాంబుజము ల్ఘటింపఁబడఁ జన్నోయి శ్రీఁ గొనుచుపై।
దయఁ దప్ప స్ప్రసపాడి పొగడపుఁ బొదంబోప్పఁ జెంగల్వ డి।
గ్గియుసీరచ్యుత మజ్జనార్థము కటిం గీలించి దివ్యప్రభా।
ధయగాస్య ల్దివిజాంగన ల్నడుతు రుద్యానంబులో త్రోవలన్॥—ఆ. ౧.

౨. చ॥ బలసిన హల్లకచ్ఛటలపైఁ దమజాంజరుమండ్లు తాయఁగాఁ।
గలమములుండుఁ బండి యొఱగంబడి నీరెడలింపఁ దృష్ణలోఁ।
దలకొననంగి ముక్ జలముఁ ద్రావెడు క్రిందటిబేళ్ళ మీఁదట।
న్నిలిపి మరందమానుకరణి న్నికటో పవనానిలాహతిన్॥— ఆ. ౧.

౩. మ॥ తరుణుల్ తల్లి రెయొ అగ్గదంబులును సందచ్ఛైత్యముల్దీము రై।
పెరరేపం బనుదెంచెఁ గాక రవిదీప్తింగ్రుంకి పాతాళగ।
హ్వరముం దూఱిన వానినీయదుకు త్రాళ్ళా తెమ్మనా దీర్ఘత।
చ్చిరకృష్టిం గనుపట్టిశైత్య మలరించె న్నూతులందత్తతిన్॥— ఆ. ౨.

౪. మ॥ గృహసమ్మార్జనమో జలాహరణమో శృంగారపల్యంకికా।
వహనంబో వనమాలికాకరణమో వాల్లభ్య లభ్యధ్వజ।
గ్రహణంబో వ్యజనాతపత్రధృతియో ప్రాగ్దీపికారోపమో।
స్పృహరీ వాదము లేల శౌరియితరు ల్నీలీలకుం జాత్రముల్॥—ఆ. ౨.

౫. ఉ॥ నావుడు వారలమ్మనుజనాథునకిట్లని రుబ్బి నేఁడు గా।
దైవము గల్గె వేగ గురుదక్షిణ గాఁ జతురర్ణవీవృతో।
ర్వీవలయం బశేషమును వేఁడుము భూవర మమ్మునందఱం।

బ్రోవుము బాంధవాప్తజనపోషణకంబగు ధర్మమున్న దే॥— ఆ. ౩.

౬. ఉ॥ హావ్రినమైత్రి పక్షులకెల్ల ఘనాత్యయకారకుండు సా।
మ్మచ్చుపడంగఁ జేయుటకునై యల క్రౌంచనగంబు పేరిక।
మ్మచ్చునసీడ్చ్చ శర్వగిరియందలి వెండిశలాకపింఛము నా।
వచ్చి మరాళమాలికలు వ్రాలెఁ గొలంకులఁ జక్రరుఙ్కృతిన్॥—ఆ. ౪.

౭. సీ॥ వాతెఱ తొంటికైవడి మాటలాడను కుటిలవృత్తివహించెఁ గుంతలంబు।
లత్తులుసిరులురానఁ జూడ్కి గనుఁగొనె నాడించెబోమగొని యాననంబు।
సనుగొమల్నెగయువతుము పేతుఁగడకొత్తెఁ బాణిపాదము లెత్తివాఱఁదొడఁగె।
సారకు మధ్యంబు దారిద్ర్యమ. లెచెప్పె తొచ్చోర్వ్వెటులోఁగఁజొచ్చె మేను।
వట్టి గాంభీర్య మొక్కఁడు పెట్టుకొనియె। నాభి నానాఁటికిఁగడి నాఁటిపొందు।
చవుకరైయొనట్టి యిచ్చటఁ జనదునిలువ।ననుచు జాతిఁ కరణి బాల్యఁబుజాతెఁ—౫.

౮. శా॥ సైరంధ్రుల్పయి కెత్తి కజ్జలముఁ బత్మ్రశ్రేణి కందీర్ప వా।
లారుం గన్నుల మీఁదుఁ జూచుతతి ఫాలాంచచ్చతుర్థీనిశా।
స్మారేందుం గనె వక్రి మక్కనుటఁ గా పర్వెందుఁ డాత్మప్రభా।
చోరుండుం డఁగఁ దన్నుఁ దగ్గత విభాచోరంబనుఁ లోకముల్॥—ఆ.౫.

౯. చ॥ విను మొకమాట రాత్రిచర వేగిర మేటికి కిన్కయింతురే।
యనిమిషులైన భాజనగతాన్నము నేనిఁక నెంతుఁబోరెద।
న్నైనఁగక ప్రాణరక్షణము పేక్షయొనర్చుట పాపమిందుకై।
కనలకు నాకు మేనియెడఁ గాంక్షయు లేదిది వోవుటే యురున్॥— ఆ. ౬.

౧౦. ఉ॥ బాసలు బండికండ్లు మఱి పాణిభయంబున లక్షచేసినం।
గ్రాసము కృచ్ఛ్రలబ్ధ ముడుగన్వశమే యిది నీకచెల్లెనో।
భూసురవంశ్య పుణ్యజన పుణ్యజనాంకము తావకీనమే।
పోసముకూరడిం గులము పొత్తున దైత్యులకెల్ల నంకతన్॥— ఆ. ౬.

ఆముక్తమాల్యదను బట్టియే కృష్ణదేవరాయలు విష్ణుభక్తుఁడనియు వైష్ణవశిష్యుఁడనియు వేఱుగఁ జెప్పనక్కఱలేకయే తెలిసికొనవచ్చును. అతఁడు విష్ణుభక్తుఁడైనను వైష్ణవ శిష్యాగ్రేసరుఁడైనను, ఇతర దేవతలయందుఁగాని యితర మతములవారియందుఁగాని వైషమ్యము లేనివాఁడయి యుండెను. ఈరాయలవారు విష్ణుదేవాలయములకు మాత్రమేకాక శివాలయములు మొదలయినవానికిఁగూడ భూదానములు చేసియున్నాఁడు; వైష్ణవమతాభిమానులను మాత్రమేకాక యితరమతావలంబులైన విద్వాంసులనుగూడ నాదరించియున్నాఁడు. అతని యాస్థానములో నల్లసాని పెద్దన మొదలైన వైష్ణవమత పక్షపాతులైన కవులుమాత్రమేకాక, స్మార్తుఁడై

శివభక్తుఁడైన నంది తిమ్మనార్యుఁడును, కేవల శైవులైన ధూర్జటియు మాదనగారి మల్లయ్యయు మొదలైన కవులునుకూడ సమ్మానమును బొందియున్నారు. అష్టదిగ్గజములని పేరొందిన యెనమండ్రు తెలుఁగుకవు లీరాజుయొక్క యాస్థానమునందుండి ప్రసిద్ధినొందిరని చెప్పుదురు. అల్లసాని పెద్దన్న, నందితిమ్మన్న, అయ్యలరాజు రామభద్రుఁడు, ధూర్జటి, మాదయ్యగారి మల్లన్న, పింగళి సూరన్న, రామరాజభూషణుఁడు, తెనాలి రామకృష్ణుఁడు, అనెడి యెనమండ్రును అష్టదిగ్గజములని వాడుక గలదు. కాని యిందుఁ జెప్పఁబడినవారిలోఁ గడపటి ముగ్గురును కృష్ణదేవరాయని కాలమునం దున్నారో లేరో యని సందేహింపవలసియున్నది. మొదటివారైదుగురును మాత్ర మాకాలమునందున్నట్లు కొన్నిగ్రంథనిదర్శనములు కనఁబడుచున్నవి. వారిలో నల్లసాని పెద్దనార్యుఁడు తానురచియించిన మనుచరిత్రమును, నందితిమ్మన్న తానురచియించిన పారిజాతాపహరణమును, కృష్ణదేవరాయని కంకితములు చేసిరి. అయ్యలరాజు రామభద్రుఁడు కృష్ణదేవరాయల కాలమునందు మిక్కిలి చిన్నవాఁడై క్రొత్తగాఁ గవిత్వము చెప్పుట కారంభించినవాఁడు. ఇతఁడు కృష్ణరాయలు జీవించియుండఁగా నాతని యాజ్ఞాప్రకారముగా సకలకథా సారసంగ్రహము నారంభించి తరువాత ముగించెనుగాని యది రామాభ్యుదయమువలె నంతప్రౌఢముగానుండక వ్యాకరణదోషములు కలదిగానున్నది. రామభద్రకవి తన్నుఁ గృష్ణరాయలు కోరుటచేత సకలకథాసారసంగ్రహమును జేసితినని వ్రాసికొన్న భాగము నాగ్రంథమునుండి యిం దుదాహరించుచున్నాను:—

“సీ॥ చినుకుపూసలసోనచిర్చిన చిత్తరపుదండ దండాలుగల తేల్పుతపసికొండ।
కొండాటములను జిక్కులుపన్ను జడదారి దారిగట్టులరాయు చీరుటలుగు।
అలుగుడింతికిపెన్నుఁ డిలకుఁదెచ్చిన చెట్టు చెట్టుగట్టుఁగఁ బేయు చెలువతోపు।
తోడుచేడెల నేలుదొరకును దోఁబుట్టు పుట్టులిబ్బులతేని పొందుగాఁడు।
గాడుపూరినిగాంచిన కన్నతల్లి। తల్లిబిడ్డలఁ జెండ్లాడు గొల్లమనికి।
మనికితముదీర్చు విలుకానిఁ జెనకుబిందు। బిందుసీకీర్తి నరసింహవిభుని కృష్ణ॥
వ॥ ఇట్లు కీర్తివిస్తార ధురంధరుండగు కృష్ణరాయ నరపాలాఖండలుండు నన్నుఁ బిలిచి శ్రీమచ్ఛీతారమణ చరణకమల పరిచరణాయమాన మానసుండవు బహువిధ కవితాచమత్కార ధుర్యుండవు సకలపురాణేతిహాస ప్రబంధరచనాదక్షుండవు మన్మనోరథ కార్యనిర్వాహకుండవు నగుటంజేసి పురాతన మహాకవి విరచితప్రబంధంబు లన్వేషించి భగవద్భక్తి నిష్ఠాగరిష్ఠులగు రాజశ్రేష్ఠుల వృత్తంబులు ప్రసిద్ధంబులగునట్లుగాఁ బ్రశస్తకథలు విన్యస్తంబులుగా సమకూర్చి సాహిత్యలక్షణ చిత్రకవిత్వ ప్రభావంబు లొక్కొక్కచోటఁ గనం

బడి రచియింపవలయునని ప్రార్థించి మఱియు నిట్లనియె॥

చ॥ అరబిత గుబ్బచన్నులె బయల్పడనీకయు ఘూర్జరాంగనా।
గురుకుచయుగ్మమున్నవలె సగూఢముగాకయు నాంధ్రదేశపుం।
గరితచనుంగవన్నవలె నాకానాకయుంచుక గానుపించినన్।
సరసులు మెత్తురక్కవిత జాణలకుం గడురంజకంబగున్॥

వ॥ కావున నతిమధురరసాయన ద్రాక్షాపాకంబుగా శృంగార రసయుక్తంబగు నట్లు సకలకథాసారసంగ్రహంబు గ్రంథవిస్తారంబు కాకుండునట్లుగా రచియింపుమని యుపన్యసించిన సంతోషామృత తరంగితాంతరంగుడ నగుచున్న సమయంబున॥"

రాజశేఖరచరిత్రమును రచియించిన మాదయగారి మల్లన్న కృష్ణదేవరాయల కాలములోనుండి యీరాజు గోలకొండ బిజాపురపు తురకసంస్థానములను జయించినప్పుడాతనికీర్తిని వర్ణించినట్లు కుమారధూర్జటి కృష్ణరాయ విజయమునం దీక్రిందిపద్యములతోఁ జెప్పియున్నాఁడు—

గీ॥ అటుల జయలక్ష్మిఁ గైకొని యరులకరుల। హరుల ధనపంక్తులను దనపరము చేసి।
వెలయు శ్రీకృష్ణరాయల విభవగరిమ। కాంచి కన్నులపండువు గాఁగనపుడు॥

గీ॥ సరససాహిత్యరచన విస్ఫురణ మెఱయ। సారమధురోక్తి మాదయగారిమల్ల।
నార్యుఁ డలయల్లసాని పెద్దార్యవరుఁడు। ముక్కు తిమ్మన మొదలైన ముఖ్యకవులు॥

క॥ వినిపించి రపుడువారికిఁ। గనకాంబర భూషణములు ఘనతనొసఁగియా।
జనవరుఁ డప్పాజిఁ గనుం। గొని యిట్లని పలికెనపుడు కుతుకంబలరన్॥—ఆ. ౩.

ఈ కుమారధూర్జటికవియే కాళహస్తి మాహాత్మ్యమును రచియించిన తన పెదతాతయైన ధూర్జటికవి కృష్ణదేవరాయల సభలోఁ బ్రసిద్ధిపొందినట్లు కృష్ణరాయ విజయములో నీక్రిందిపద్యము చేతఁ జెప్పియున్నాఁడు —

చ॥ స్తుతమతియైన యాంధ్రకవి ధూర్జటిపల్కుల కేలగల్గెనో।
యతులిత మాధురీమహిమ నా మును మీ పెదతాత చాల స।
న్నుతిగనెఁ గృష్ణరాయల మనోజ్ఞసభన్ నీవును మీవునట్లు మ।
త్కృత బహుమానవైఖరులఁ గీర్తివహింపుము ధాత్రిలోపలన్॥—ఆ. ౧.

అష్టమహిషీకళ్యాణమును ద్విపదకావ్యముగా రచియించిన తాళ్ళపాక చిన్నన్నయును కవికూడ కృష్ణదేవరాయని కాలములోనున్నట్లు కొండవీటిచరిత్రములో కృష్ణదేవరాయల దానములనుగూర్చి చెప్పిన యీక్రింది వాక్యములవలనఁ దెలియవచ్చుచున్నది—

"వినుకొండసీమలో మిన్నికల్లు తాళ్ళపాక చిన్నయ్యగారి కగ్రహారమిచ్చెను."
"అద్దంకిసీమలో వలపర్ల అను గ్రామము తాళ్ళపాకచిన్నయ్యగారి కిచ్చెను."

[సశేషము.] కం. వీరేశలింగము.

జంతుస్వభావచరిత్రము. (౭౨-పుట శేషము.)



ఈపొడుగుతోఁక కోఁతులలోనే యీ ప్రక్క పటములోఁ జూపఁబడినరీతిని యఱపుల కోఁతులని యొకజాతివిగలవు. అవి సూర్యోదయాస్తమానములయందు గుంపులుగాఁ జేరి చెవులు చిల్లులువోవునట్లుగా నఱచును. దానికూఁత యరక్రోసెడు దూరమువఱకును స్పష్టముగా వినఁబడును. ఇవి యంత చఱుకయినవి గావు. సాలెకోఁతులలోఁ గొన్ని మిక్కిలిసోమరులు. అవికొన్ని కన్నులు మూసికొని కొమ్మలమీఁదఁ గూరుచుండి గాని తోఁక కొమ్మకుఁ జుట్టఁబెట్టి తలక్రిందుగా వ్రేలుచుఁ గాని యరణ్యములలో నుండెడు మన దేశపు మహాయోగులవలె గడ్డములు వ్రేలఁగాలు చేయి కదల్పక గంటలకొలఁది మౌనముతో నుండును.

ఎరనిమిత్తమయి రాత్రులు తిరుగుచుండుటచేత నిశాచరములని పిలువఁబడెడి యింకొకజాతి చిన్నకోఁతులు గలవు. అవి సాధారణమైన పిల్లియంతలేసి యుండును. వానియెత్తొకయడుగుండును. వీనికి నాలుగుచేతులున్నను మూతి కోఁతి మూతివలె నుండక వాఁడియైన కోఱలను గలిగి పందికొక్కు మూతివలె నుండును; చేతులకొనలయందు పిల్లి గోళ్ళవంటి గోళ్ళుండును. అకస్మాత్తుగాఁ జూచినపక్షమున పిల్లివలె నుండునుగానఁ గొందఱీజాతి కోఁతులను పిల్లులనుగా భ్రమింతురు. ఇవి పగలెల్లను నిద్రపోయి మేతనిమిత్తమయి రాత్రులు బయలువెడలును. చీఁకటిపడిన కొలఁదిని వానిగ్రుడ్లు పెద్దవయి నక్షత్రములవలె మెఱయుచుండును. అవి చీఁకటిలో వస్తువులను జూడఁగలవు. అవి పిఱికివగుటచేత సాధారణముగా మనుష్యుల యలుకుడు వినఁగానే పాఱిపోయినను, పాఱిపోవుటకు వీలులేకపోయినపక్షమున మనుష్యులమీఁదపడి గోళ్ళతో రక్కి పండ్లతోఁ గఱచి గాయపఱుచును. దేవాంగి పిల్లియనఁబడెడి యీజాతికోఁతి యొకటి మనదేశమునందుఁ గలదు. దానికాళ్ళు చేతులును మిక్కిలి సన్నముగా నుండును. అది చీఁకటిపడినతరువాత నిద్రనుండి మేలుకొని, చీఁకటిలో మిడిగ్రుడ్లు నిప్పుబంతులవలె మెఱయ బయలుదేఱి, పక్షులు కొమ్మలమీఁదఁ గూరుచుండి నిద్రించుచున్న సమయములో నిశ్శబ్దముగా చెట్టుమీఁది కెగఁబ్రాఁకి, చేయి మొనమీఁదఁ బడువఱకును దెలియకుండునట్లుగా మెల్లగా కొమ్మ

మీఁదికి నడిచిపోయి, బాణమువలెఁ దనచేతిని మహావేగముతోఁ బఱపి గొంతుపట్టుకొని, నిద్ర తెలిసి కన్నులు తెఱచునంతలో పక్షిని పెద్దనిద్దురవుచ్చి శాశ్వతముగా కన్నులు మూతపడునట్లు చేసి, తనయెరతో వాయువేగమునఁ బరుగెత్తిపోయి సుఖపారణచేయును. ఇది పక్షులనుమాత్రమే కాక పండ్లను పురుగులనుకూడ భక్షించును. ఇది దేహమునం దంతటను నల్లనల్లని పెంట్రుకలను కడుపుమీఁద తెల్లపెంట్రుకలను గలదయి జేనెడు పొడుగుండును. ఇది నిద్రపోవునప్పుడు తల పొట్టలోఁ బెట్టుకొని ముడిఁగి బంతివలె పరుండును. ఈజంతువులు దక్షిణహిందూస్థానమునందును సింహళద్వీపమునందును విస్తారముగా నున్నవి. ఇవి పట్టుకొన్నప్పుడు మొట్టమొదట దుష్టచేష్టలుగలవై కఱచునుగాని తరువాత మచ్చికపడి సాధువులగును. ముక్కును పెదవులునుదక్క తక్కిన దేహమంతయు బూడిదవర్ణముగల పెంట్రుకలతో నిండియుండఁగా పొట్టితోఁకయు పెంట్రుకలతో నిండియున్న చెవులును గలవై, దృఢమయిన యవయవములుగల యీజాతిలోని యింకొకతెగ జంతువులు బంగాళమునకు తూర్పుననున్న రంగపురము మొదలయిన ప్రదేశములయందును బ్రాహ్మదేశమునందును గలవు.

ఈజాతిలోనే తెక్కలుగల విచిత్రమయిన జంతు వింకొకటి గలదు. దానిని సాధారణముగా తెక్కలకోఁతియని చెప్పుదురు. పక్షులవలె దాని కీఁకలుగల తెక్కలు లేకపోయినను, కాళ్ళనంటి ముందటికాళ్ళకును వెనుకకాళ్ళకును మధ్యను, ముందటికాళ్ళనుండి మెడకును, వెనుకకాళ్ళనుండి తోఁకకును జేరి గబ్బిలపు తెక్కలవంటి రోమమయమయిన చర్మముండును. ఈజంతువులు కావలసివచ్చినప్పు డాచర్మమును విప్పి క్రిందికి దిగనక్కఱలేకయే యొకచెట్టుమీఁదినుండి యొకచెట్టుమీఁదికి పక్షులవలె నెగురును. ఈతెక్కలకోఁతి యొకచెట్టునుండి డెబ్బది గజముల దూరములో నున్న మఱియొకచెట్టుమీఁదికి గాలిలో నెగిరి యుద్దేశించుకొన్న కొమ్మమీఁద వాలఁగాఁ దాను జూచితినని యొక జంతుశాస్త్రజ్ఞుఁడు వ్రాసియున్నాఁడు. ఇది యాకులను, పండ్లను భక్షించును. గబ్బిలమువలె చెట్లకు తలక్రిందుగా వ్రేలుచు. ఈజాతి జంతువులన్నియు నొక్కసారి యొక్కపిల్లనుమాత్రమే పెట్టును. ఇవి మలయపర్యాయద్వీపమునందును, సుమిత్రద్వీపము మొదలయినదీవులయందును వసించును.

పక్షహస్తజంతువులు.

చేతులవంటి తెక్కలుండును గనుక జంతుశాస్త్రమునందు గబ్బిలములు పక్షహస్తజంతువులు అనఁబడును. వింతయైన యీజంతువుల కెగురుటకు తెక్కలున్నను, పక్షులవానికివలె నీఁకలులేక తెక్కలు పలుచని చర్మముతో మాత్రమే చేయఁబడి

యుండుటచేత సంస్కృతభాషలో గబ్బిలములకు "అజినపత్ర"లని పేరు. ఇవి పక్షులని సాధారణముగాఁ జెప్పఁబడినను, నిజమునకు పక్షులుగాక యెగిరెడు మృగములయి యున్నవి. ఇవి పక్షులవలె గ్రుడ్లనుండి పుట్టవు; వీనితల యెలుకతలవలెనుండి లోపల పండ్లను కోఱలను గలిగియుండును; ఎలుకలు మొదలయిన జంతువులకువలెనే వీనికి నాలుగుకాళ్ళును తోఁకయు నుండును; దేహమున రోమములుండును; ఇవి చతుష్పాద జంతువులవలెనే పిల్లలను గని స్తన్యమిచ్చి పెంచును. ముందటికాళ్ళనఁబడెడు వీనిచేతులు మిక్కిలి పొడుగులయి తెక్కలవలె నుపయోగించుటకు తగినవై యున్నవి; వానివ్రేళ్ళు సన్నగా చేతులంతలేసిపొడుగున నుండును; బొటనవ్రేలికిఁదక్క మిగిలిన నాలుగువ్రేళ్ళకును మధ్యను బాతుకాలికివలె చర్మముండి, అది ముందటిచేతులను వెనుకటికాళ్ళతో గడ్డతో నంటించినట్లు కడుపునంటి వ్యాపించి, అటుపిమ్మట వెనుకకాళ్ళనుండి పొడుగునను తోఁకచివరవఱకు నుండును. అంతేకాక యాచర్మము ముందటిచేతుల పొడుగునను మెడతోనంటి వ్యాపించియుండును. ఆచర్మమును ముడుచుకొని గబ్బిలములు చుంచువలె నాలుగుకాళ్ళతోను భూమిమీఁద ప్రాకఁగలవు. ఈ ప్రక్క పటములో వేసిన గబ్బిలము తెక్కలు ముడుచుకొని నడుచుచున్న స్థితిలోనున్నది. ముందటి చేతుల బొటనవ్రేళ్ళు మాత్రము చర్మములోఁ జేరక విడిగాఁ గొంకెము పొట్టిగానుండి చివరను చిలుకముక్కువలె వంకరగానుం



డెడి యొక పెద్దగోరును గలిగియుండును. గాలములవలె వంపుగా నుండెడి యీ గోళ్ళను చెట్లకొమ్మలు మొదలయినవానికి తగిలించి గబ్బిలములు తలక్రిందుగా వ్రేలాడఁగలవు. వెనుకకాళ్ళకు వ్రేళ్ళు పొడుగుగానుండక పక్షివ్రేళ్లవలె పొట్టిగానుండి యయిదువ్రేళ్ళ చివరలనుగూడ గోళ్ళను గలిగియుండును. ఈ వెనుకటి కాళ్ళ గోళ్ళతోనే సాధారణముగా గబ్బిలములు చెట్లకొమ్మల నంటిపట్టుకొని వాలఖిల్యులవలెఁ దలక్రిందుగా వ్రేలుచుండును. వెనుకటికాళ్ళు ముందువానివలెఁగాక పొట్టిగా నుండును. ఇరుప్రక్కలనుగల యీచర్మమును విప్పినపక్షమున, అది యెడమవైపుననున్న కాలుచేతులలోఁ గలిసి యొకతెక్కగాను కుడివైపున నున్నకాలు చేతులలోఁగలిసి రెండవతెక్కగాను ఏర్పడి, గబ్బిలము పక్షివలె వానితో నెగురును.

ఈ గబ్బిలములలో నానాజాతులు గలవు. అందు కొన్ని మాంసమును భక్షించును; కొన్ని కూరగాయలను తినును. అమెరికా ఖండమునందు రక్తపానము చేసెడి యొక క్రూరమయిన గబ్బిలపుజాతి కలదు. ఈజాతివానిని రాక్షసిగబ్బిలములని చెప్పెదరు. ఈ రాక్షసిపిట్టలనుగూర్చి కథ లనేకములు చెప్పెదరుగాని యవి కేవల విశ్వాసయోగ్యములుగాక కొంతవఱకు కల్పితోక్తులుగా నున్నవి. ఇవి రాత్రుల యందు గాఢనిద్రలోనున్న మనుష్యులనుగాని గుఱ్ఱములు మొదలైన జంతువులనుగాని చప్పుడుచేయక సమీపించి, నెత్తురు విస్తారముగాఁ బ్రవహించెడు రక్తవాహికలున్న భాగమునందు సూదివంటి పంటితో చిన్నగంటు చేసి, దానినుండి పొట్టనిండునట్లుగా జెలగవలె రక్తమును పీల్చి, పాఱిపోవును. అదృష్టహీనమైన యాజంతువుగుఱ్ఱమైన పక్షమున, గంటు చెవులయందో వీపుమీఁదనో చేయును. ఒకవేళ మందభాగ్యుఁడైన మనుష్యుఁడే యెవ్వఁడయిన బట్ట కప్పుకొనక రాత్రివేళ బయలనుండి నిద్రపోవుచుండుట తటస్థించిన పక్షమున, రాక్షసిగబ్బిలము మెల్లగా నిద్రించువాని సమీపమున వ్రాలి, ఆయున్నదేశమునందు హాయిగా నిద్రపట్టుట కనుకూలముగా నుండు చల్లగాలి పోఁకునట్లుగా తనఱెక్కలతో మెల్లగా విసరి యామనుష్యుని గాఢనిద్ర పుచ్చి, తరువాత పాదమువద్దఁజేరి కాలి బొటవ్రేలికి సూదిమొనవంటి పంటితో సూక్ష్మమయిన గాయమునుజేసి నిద్రితునికిఁ దెలియకుండనే కావలసినంత నెత్తు రాప్యాయనముగా త్రాగి లేచిపోవును. తెల్లవాఱి లేచినతరువాత బలహీనతచేతను చేరువను రక్తము కాఱియుండుటచేతను రాక్షసిగబ్బిలమువచ్చి రక్తపానము చేసి పోయినట్టు తెలియునుగాని లేకపోయిన తెలియనే తెలియదు. ఇట్లు గాయపఱుపఁబడినది చిన్నజంతువులయినపక్షమున, రక్త మతివిస్తారముగా పోవుటచేత ప్రాణాపాయము సహితము సంభవించును. కాఁబట్టి యాదేశమునందలివారీగబ్బిలములకు మిక్కిలి భయపడుదురు. రాక్షసిగబ్బిలములు మిక్కిలి హానికరము లయినను, ఇవి గబ్బిలపుజాతిలోనెల్ల పెద్దవిగావు. ఇవి తలమొదలుకొని తోఁకచివరవఱకును అఱేడంగుళములకంటె నెక్కువపొడుగుండవు. ఱెక్కలు చాచినపక్షమున వాని పొడుగు రెండడుగులకంటె నెక్కువగా నుండదు. వీనివర్ణ మించుమించుగా నెలుక రంగువలె నుండును. వీనిముక్కుపైని ఆకువంటి చర్మముండును. ఇవి రక్తప్రియము లయినను, ఒక్క రక్తపానముతోనే జీవనము చేయక పురుగులు మొదలైనవానిని పట్టుకొని చంపి భక్షించి జీవించును. ఇవి పక్షులవలె నెగురుటయేకాక భూమిమీఁద కూడ నెలుకలవలె నాలుగుకాళ్లతోను వేగముగా పరుగెత్తఁగలవు. అయినను భూమిమీఁద నడుచుట గబ్బిలపుజాతికి స్వాభావికముకాదు. అవి భూమిమీఁదపడుట తటస్థించినపక్షమున, గోడ చెట్టు మొదలయిన యెత్తుస్థలము దొరకువఱకును నేల మీఁద వికారముగా నడిచి వానిమీఁదికి ప్రాఁకి యక్కడనుండి యెగిరిపోవును. అవి

భూమిమీఁదినుండి యొక్కసారిగానే యెగరఁగలవుగాని సాధారణముగా నల్లెగు రక కొంత యెత్తుస్థలమున కెగఁబ్రాఁకి యక్కడనుండి సులభముగాఁ బైకెగురును. ఈ రాకాసిజాతి గబ్బిలములు హిందూదేశమునందును గలవుగాని యవి మిక్కిలి చిన్నవి. అవి మూడంగుళముల పొడుగుగలవయి చీఁకటి గుహలయందును, పాడుపడిన యిండ్లయందును, ఇంటికప్పులయందును పగలెల్లను దాఁగియుండి, చీఁకటి పడినతరువాత బయలువెడలి పురుగులను, కప్పలను, పిచ్చుకలు మొదలయిన చిన్నపిట్టలను, తమకంటెఁ జిన్నజాతి గబ్బిలములను పట్టుకొని తినును. ఈజాతి పక్షియొకటి సంజవేళను మఱియొక చిన్నగబ్బిలమును పట్టుకొని మెడసమీపమునఁ గఱచి యెగురుచునే దానిరక్తమును పీల్చుచుండఁగా నొక జంతుశాస్త్రజ్ఞుఁడు చూచియున్నాఁడు.

గబ్బిలపుజాతిలోనెల్లను చెట్టుగబ్బిలములు మిక్కిలి పెద్దవి. ఇవి పగలెల్లనువందల కొలఁది గుంపులుగుంపులుగా చెట్లను తలక్రిందుగా వ్రేలుచుండును. ఇవి మాంసమును పురుగులను తినక పక్షిజాలవలె శాకములతోను పండ్లతోను మాత్రమే పొట్ట పోసికొనును. వీనికి తోఁకలేదు. సాధారణముగా వీనిశరీరము తొమ్మిదంగుళముల పొడుగుండును. ఇవి రెక్కలుచాచినప్పుడు నాలుగడుగుల పొడుగుండును. ఇవి రూపమునఁ గొంతవఱకు నక్కలవలెఁ గానఁబడునుగానఁ బశ్చిమఖండవాసులీదేశములో వీనిని "ఎగిరెడునక్కలు" అని పిలుతురు. ఇవి సాయంకాలము కాఁగానే కొమ్మలమీఁద కదలుట కారంభించి క్రమక్రమముగా నొకటొకటే రాత్రి సంచారమునకు బయలువెడలును. అవి నివసించు తావునకు సమీపమున చెఱువుగాని నదిగాని యున్నపక్షమున ముందుగా శరీరముతో నీటిని స్పృశించి మఱి సంచారమునకు వెడలును. అవియట్లు నీటిని తాఁకుట దప్పి తీర్చుకొనుటకయి యుండును. వానికి మనుష్యులు తోటలలో వేసికొనెడు పండ్లయందు ప్రీతి యెక్కువ. కాఁబట్టి యివి పుల్లని దబ్బపండ్లు మొదలయిన వానిని మాత్రము విడిచి తక్కిన సమస్త ఫలములను భక్షించును. ఇవి మామిడితోటలలోను జేమతోటలలోను బడి రాత్రులు పండ్లను భక్షించిపోవుచుండుట యీదేశమునందు తోటలుగలవారి కందఱికి ననుభవసిద్ధమే కదా? ఫలోన్ముఖమునకు వచ్చినప్పుడు తియ్యమామిడిచెట్టుమీఁద పడి యివి రాత్రి పండ్లను తినిపోఁగా తెల్లవాఱినతరువాత వట్టిటెంకలు చెట్లమీఁద నిడుదలయిన తొడిమలకు వ్రేలాడుచుండుట యొక్క తోఁటవాండ్రకుఁ దక్క తక్కిన వారికెల్ల చూచుటకెంతయువింతగా నుండును. ఆరామపాలకులు వీనిధాటికి భయపడి పండ్లకు వెదురుతేళ్ళతోఁగాని తాటాకులతోఁగాని బుట్టలల్లి కట్టుదురు. ఇవి వత్తిపండ్లు మొదలయినవానినికూడ భక్షించును. ఇట్టివి రాత్రులాహారమునిమిత్తమయి నాలుగయిదామడల దూరమువఱకును యాత్రచేసి తెల్లవాఱునప్పటికి వచ్చి మరల తమ నివాసస్థానమును చేరుకొనును. అట్లు వచ్చినతరువాత ప్రతిపక్షియు తానేయున్నతమ

యున మంచిస్థలము నాక్రమించుకొని యితరపక్షులను తఱిమివేయఁ జూచుచుండుటచే వానిలోవానికిఁ గొంతసేపటివఱకును ద్వంద్వయుద్ధము జరగుచుండును. ఈ ద్వాన్ద్వికయుద్ధములోఁ బ్రతిపక్షియు నేదో యొకకొమ్మను గోళ్ళతోఁ బట్టుకొని వ్రేలుచు, దగ్గఱకు వచ్చినవానిని గోళ్ళతోఁ రక్కియు పండ్లతోఁ గొఱికియు దూరముగాఁ బాఱఁదోలుచు, విశ్రామము లేకుండ కీచుమని కూయుచుండును. దంతాదంతిని నఖానఖిని జరగుచుండెడి యీ సంకుల సమరములోఁ బ్రతిపక్షియు రెండుమూఁడు సారులు తఱుమఁబడి చెట్టుచుట్టును స్తోత్రపాఠములు చేయు భక్తియుక్తులయిన హిందూమహాజనులవలె నఱచుచుఁ బ్రదక్షిణములు చేసి తుదకెక్కడనైనా యొకచోటఁ గాలూని నివాసము కుదుర్చుకొనును. ఈసందడియంతయు జాము ప్రొద్దెక్కులోపల సద్దణఁగును. అప్పటినుండి గబ్బిలము లన్నియు నిశ్శబ్దముగా నైమఱచి నిద్రపోవును. వీనివలెనే యన్నిజాతుల గబ్బిలములును పగటిపూట నిద్రపోయి రాత్రి సంచారము చేయును. ఇవియున్నచోట నొకవిధమయిన దుర్గంధము కలుగును. ఈచెట్టుగబ్బిలములను మనవారు చీకురువాయియని చెప్పుదురు. ఈదేశములోని తక్కువజాతులవారనేకు లీగబ్బిలములను జంపిభక్షింతురు. వీనిని సులభముగా పెంచి మచ్చికపఱుపవచ్చును. ఆఁడుగబ్బిలములు సాధారణముగా చైత్రమాసమునందు పిల్లలను పెట్టి, జ్యేష్ఠమాసమువఱకును పిల్లలను కోఁతులవలె తొమ్మునఁ బెట్టుకొనితిరుగును. అప్పటికాపిల్లలు పెద్దవయి స్వతంత్రముగాతిరిగి యాహారము సంపాదించుకొనుటకు శక్తములగును. మలయ పర్యాయద్వీపమునందుండెడి యీజాతి పక్షులు మిక్కిలి పెద్దవి. వానిశరీర మడుగు పొడుగుండును; ఱెక్కలుచాచినప్పుడవి నైదడుగుల పొడుగుండును.

ఇంకొకజాతి చిన్నగబ్బిలము లింటిగబ్బిలము లనఁబడును. అవి పరిమాణమునందు రెండంగుళముల కంటెను తక్కువగా నుండును. వానికి వెలుతురు బొత్తిగా పడదు. సూర్యకాంతి వానికన్నులను మిఱుమిట్లుగొలుపును గనుక పగలెల్ల నవి యిండ్లలోని చీఁకటిగల యటుకలు మొదలయిన భాగములయందు వ్రేలుచు రాత్రివేళ పురుగులు మొదలయిన వానిని పట్టుకొనుటకు వెలువడును. వీనిని మనవారు చివుకుపిట్టలని చెప్పుదురు. ఇవి యెప్పుడును గృహములలోనే వాసముచేయుచుండును. రాత్రులయందు వీనిని మనము మనగదులలో సహిత మెగురుచుండఁగాఁ జూచుచుందుము.

గబ్బిలములలో ననేకజాతులు గలవు. ప్రతిజాతియందును మరల నంతర్భాగము లనేకములున్నవి. ఒక్క హిందూదేశమునం దిదివఱకెన్నూరు వేఱువేఱుతెగల గబ్బిలములు కనిపెట్టఁబడియున్నవి. వర్ణమునందుఁగల భేదమునుబట్టియు, ముక్కులును చెవులును పొడుగుగాను పొట్టిగాను నుండుటనుబట్టియు, పండ్లు మొదలయిన వానిలోఁగల భేదములనుబట్టియు, తోఁకలుండుటను లేకపోవుటనుబట్టియు, శరీర

ములమీఁది రోమములపొడవు తెలుపు నలుపు మొదలైన వానినిబట్టియు, ముక్కు- మీఁది యాకువంటి చర్మముయొక్క భావాభావములనుబట్టియు, తినెడి యాహార పదార్థములనుబట్టియు, జంతుశాస్త్రజ్ఞులు వీనిని నానావిధములుగా భాగించియున్నారు. తోఁకలుగల వానికాతోఁకలు పడవలకు చుక్కానివలె నెగురుటయందు వాని గమనమును నడుపుట కుపయోగించును.

చలిదేశములలో కొన్నిజాతుల గబ్బిలములకు శీతకాలమునందు యోగనిద్ర కలదు. ఆదశలో నవి నిద్రపోవుచున్నట్లుగా కాలుచేయి కదలుపక పడియుండును; అప్పుడు వానికి శ్వాసముసహిత ముండదు. కాఁబట్టి యవి శీతకాలమునం దంతటను పురాణములలోఁ జెప్పఁబడిన సమాధియందున్న యోగులవలెనే యూపిరిలేక జడ పదార్థములోయన శవములరీతిని పడియుండి, శీతకాలము పోఁగానే యోగనిద్ర నుండిలేచి ప్రపంచవ్యాపారములయందు సంచరింప నారంభించును. దయామయుఁడైన భగవంతుఁ డీయేర్పాటు నే చేయకయుండినపక్షమున, పురుగులు దొరకని యా కాలమునం దాదేశములలోని గబ్బిలములన్నియు నాహారములేక సంఘమరణము నొందవలసెయుండును. ఇటువంటి యోగనిద్రనుగల గబ్బిలములు భరతఖండమునం దును హిమాలయ ప్రాంతములయందుఁ గలవు. వానికి చెవులు పెద్దవిగా నుండును. వానిశరీర మంగుళమునర యుండును. అవి వసంతఋతువునందు మనోహరముగా సంధ్యాసమయమున నెగురుచుండును. అవి శీతకాలములో యోగనిద్రను పొందుట చేత కార్తికమాసము మొదలుకొని మాఘమాసమువఱకును కనఁబడవు.

మాంసభక్షకజంతువులు.

చతుష్పాదజంతువులలో నెల్లను మిక్కిలి సుందరములును భయంకరములు నయి నవి మాంసాశనములయిన ఘాతుకమృగములు. వానిలో పిల్లిజాతివి మిక్కిలి చక్కనివి. ఈజాతిజంతువులన్నియు నిశ్శబ్దముగా నడిచి, సూక్ష్మమైనదృష్టిబలమును శ్రవణ బలమును గలవయి, జంతువులమీఁద నేమఱుపాటున మహావేగముగాఁ బడి హింసింప శక్తిగలవి. వీనిలో సింహము, వ్యాఘ్రము మొదలైనవి కొన్నితప్పఁ దక్కినవన్నియు చెట్లనెక్కఁగలవు. ఈజాతి జంతువులకన్నిటికిని నోటిలో పెద్దకోఱపండ్లును, ముం దటికాళ్ళ కయిదేసియు వెనుకకాళ్లకు నాలుగేసియు చొప్పున నిడుపులై కత్తుల వలె వాడులైనగోళ్లును, ఉండును. వాని దౌడలు మిక్కిలిబలిష్ఠములుగా నుండును; గోళ్ళు వాడిచెడకుండ లోపలికి ముడుచుకొనుటకుఁ దగినయొరలలో నుండును; నాలుక కఱకయి యెముకలనుండి మాంసమును నాకివేయుట కనుకూలమయినదిగా నుండును; మీసములు చీఁకటిలో నడుచునప్పుడు స్పర్శేంద్రియముగా నుపయోగించు

నవిగా నుండును. ఈజంతువు లాహారమునిమిత్తమితరజంతువులతో ననుదినమును బోరాడవలసియుండుటచేతను, ఎదుటఁబడినప్పుడు కొన్నిజంతువు లెదిరించియుఁ గొన్ని పిక్కబలమును జూపియుఁ గొన్ని చెట్లెక్కియుఁ గొన్ని బొరియలుదూఱియుఁ బ్రాణరక్షణము చేసికొనయత్నించి తప్పించుకొనుచుండుటచేతను, ఘాతుకమృగములవద్ద మాయోపాయము అధికముగా నుండును. ఘాతుకమృగములలో నెల్లను శ్రేష్ఠమైనది సింహమగుటచే దానినిగూర్చి మొదట వ్రాయుదము.

సింహము.

సింహము సమస్తదేశములవారిచేతను మృగరాజని చెప్పఁబడును. సింహముయొక్క ధైర్య సాహసములనుబట్టి పరాక్రమవంతుఁడయిన వీరపురుషుని చెప్పవలసి వచ్చినప్పుడు కవులు సింహవిక్రముఁడని వర్ణింతురు. ఈక్రింది పటములోఁ జూపఁబడినది పురుషసింహము. మగసింహము మెడ కలంకారముగా జూలువంటి కేసరములను గలిగియుండును. ఈయలంకారము ఆఁడుసింహమునకుండదు. మగసింహములకు సహితము మీసటలు రెండుమూఁడు సంవత్సరముల ప్రాయము వచ్చువఱకును మొలవవు. అడవులలో స్వేచ్ఛముగా విహరించుచు గోముగాఁ బెరిగిన పురుషసింహము ముందుపైపున భుజములవద్ద నాలుగడుగుల యెత్తుండును; దానిపొడుగంతయుఁగలిసి పదునొకండడుగులుండును. రూపమునం దాఁడుసింహము మగదానికంటె మిక్కిలి చిన్నదిగా నుండును. కాని యది యాఁడుదైనను దానియొద్దఁ బౌరుషమధికముగా నుండును. ముఖ్యముగా స్త్రీసింహము పిల్లలను పెట్టియున్నకాలములో దాని గుహాసమీపమునుండి పోవుట యెంతబలవంతమయిన జంతువునకును మృత్యుగృహమునకుఁ బోవుటయే. ఆసమయమునం దది యెంతటి భీకరజంతువునైనను జంకులేక యెదిరించి, అనివార్య ధైర్యముతోఁ బోరాడి, నిమిషములో నంతమును నొందించును. సింహములు కొంచెము పసపుదాళుగల బూడిదవర్ణము కలవిగా నుండును. అరంగు కడుపుపైపున లేతగాను, వెన్నుపైపునకుఁ బోయినకొలఁదిని ముదురుగాను, ఉండును. పిల్లిజాతిలోనెల్ల నొక్క సింహమునకు మాత్రమే తోఁకచివరను కుచ్చుండును.



(సశేషము.)

కందుకూరి-వీరేశలింగము.

జయద్రథనాటకము, ప్రథమాంకము.

(౮౭-వ పుట శేషము.)

౨. మంత్రి—నావి రెండువందలు. ఇట్టియుత్తరము లూహవలననే తరుచు వ్రాయబడుటవలన నొకదానితో నొకటి యేకీభవించకున్నను, అన్నియుత్తరములును తురుష్కుల సైన్యమని మాత్రము చెప్పుచున్నవి.

రాజు—నేనీభేదము నంతగా లక్ష్యపెట్టను. బాగుగ యోచించిన తురుష్కులదండయాత్ర సత్యముగా కానుపించుచున్నది.

నావికుడు [తెరలో] అయ్యా! అయ్యా! ప్రభువులు.

౧. ఉద్యో—రాయబారియని తోచుచున్నది.

[నావికుడు ప్రవేశించును.]

రాజు—ఏమివిశేషములు!

నావికుడు—మహాప్రభూ! తురుష్కసైన్యంబు లీయెడ లక్షద్వీపంబులంబాసి మలయద్వీపంబుల కేగుచున్నవి.

రాజు—ఏమియీవింత!

౧. మంత్రి—ఏవిధంబున యోచించినను తప్పకయిదియనృతమని తోచుచున్నది. మనలను భ్రమపెట్టుటకు వారొనర్చుచున్న యుపాయమయి యుండవచ్చును. ఏలయన లక్షద్వీపము తురుష్కులకెంతయు నావశ్యకము. ఇక లక్షద్వీపమును జయించుటకంటె మలయద్వీపమును చేకొనుట నూరురెట్లుకష్టము. ఈ రెండును యోచించినచో తురుష్కులంత వెఱ్ఱులుగాక మనలను భ్రమపెట్టుటకే యిట్లుచేయుచున్నారని తోచకమానదు.

రాజు—ఎట్లాలోచించిన నిది కల్లయని తోచుచున్నది.

౧. ఉద్యో—ఇదిగో వర్తమానము.

[రాయబారి ప్రవేశించును.]

రాయ—దేవరకు జయమగుగాక! తురుష్కులు మలయద్వీపంబులవైపున కేగి అచ్చట మరికొంత సైన్యముతోగూడి తిరిగి లక్షద్వీపంబులవైపున కేగుచున్నారు.

౧. మంత్రి—ఆ! నేనట్లు యోచించితిని. ఎన్ని యోడలని తోచుచున్నది?

రాయ—ముప్పదియోడలు. ఇప్పుడు వారినావలు నిర్భయముగా లక్షద్వీపముల కేతెంచుచున్నవనియును, ఈవర్తమానము నమ్ముమనియును మీసేవకుడగు మనోరంజనుడు దేవరకువిన్నవించుమని నన్నుబుత్తెంచె.

రాజు—సరే. ఇకనిశ్చయముగా లక్షద్వీపమునకే.

౧. మంత్రి—ఇదె జయద్రథుడును జయలోలుడును వచ్చుచున్నారు.

[జయద్రథుడు, జయలోలుడు, కలహప్రియుడు, కామపాలుడు ప్రవేశించుచున్నారు.]

రాజు—జయద్రథా! వీర్యవంతా! నిన్ను మేమీక్షణమందు మల్కులపై దండువెడలనియోగించెదము. (జయలోలునితో) ఇదిగో మిమ్ములను చూడలేదు. రండి కూర్చుండుండి. మీయాలోచన, సహాయము మాకీరాత్రి లేకపోయినది.

జయ—చ॥ వరదలభాంగువాహిని యమారితరీతిని గాల్వతల్పులన్
భోరిపోరిత్రోసి పోవుగతి బూర్ణముగా నెదనుండిదుఃఖమే
తెరిననుముంచి నైపెడలె దానిని సైపగలేక నద్రిపై
శిరయము చేతనే నరుగు చెందిరి గానిమరేమికారణం
బరయగలేను దేశమున కన్యేదుకీడును లేపలేమునన్
ధరణిప సైపు మయ్యయిట దప్పితి వీవచనంబునీయెడన్॥

రాజు—ఏమి? కారణము?

జయ—అయ్యో! నాకూతురు—నాకూతురు—

రాజమంత్రులు—మృతినొందినదా?

జయ—అయ్యో! ఆమె నాయింటనుండి దొంగిలింపబడినది. మందులు మాకులు పెట్టి దానిబుద్ధిగొల్లదరు దుర్మార్గులు త్రిప్పివేసిరి.

ఉ॥ మందులజేసి యిట్టిమటుమాయలఁ జిక్కునుగానిగాని చో
సుందరగాత్రియేమనను! జూడగలేదాకా మంచిచెడ్డలన్
మందునమందసందుడ సమంచితరైవడి బోయికూడనే
మందును మద్దదుఃఖమున మందిట లేదిక నన్నుదేర్పగన్॥

రాజు—ఇట్లునిన్ను మోసముచేసి నీకూతు బుద్ధిని విరిచి కొంపోయినవాడు మావృత్రుండయినను వానినీయిష్టమయినశిక్ష చేయించెదము.

జయ—నాపైనింతయనుగ్రహము చూపినందుకు కృతజ్ఞతతో మీకు మ్రొక్కుచున్నాను. నాకిట్టియిక్కట్టు దెచ్చినవాడీజయద్రథుడు.

రాజమంత్రులు—దీనికిమాకు చాలవిచారముగానున్నది.

రాజు—[జయద్రథునితో] దీనికి నీవేమిచెప్పగలవు?

జయ—ఏమనగలవు—నే జెప్పినది నిజమనక.

జయద్ర—ప్రభువులారా! నేనీవృద్ధుని కుమారిని కొంపోవుట సత్యము. సత్యముగా

నేనామెను వివాహంబైతిని. నేనొనర్చిన నేరమింతియె!

శా॥ బాలత్వంబుననుండి యుద్ధధరణుల్ వాసంబుగా నొప్పనే
నీలోకంబుననున్న కష్టములలో నెన్నోతగంజాచితిన్
కాలంబంతయు నిట్లుపోయెనయయో కష్టానతీవశ్యమిం
కేలీలన్ మదిలో నెరుంగుదువహా! యేయేమఱంతుల జేతునో!!

ఉ॥ మందులుమాకులుం దెలియ మంత్రములున్ దగనేర్వలేదు నే
నిందుముఖీ జనంబులకు నెప్పుడు వశ్యము జేసియుండ నీ
సుందరినన్ను గూర్చి కడుసూనశరాళిని జిక్కి జేగునా
చందముచూచి కిందిలికి జయ్యన నిచ్చితినాదు సమ్మతిన్॥

జయ—చ॥ పిరికితనంబు శాంతి యతిభీతియు గల్గి స్వకీయదేహ సం
జరచలనంబు గాంచి మదిదారుణలీల భ్రమించునట్టి నా
చిరుతయు నట్టి దుష్టుగని చిత్తమునన్ భయమింత లేక తా
వరునిగ గోరు నేయకట పాపపు రుందులగాక దైవమా॥

సీ॥ ఇట్టిసుందరీతిలకంబు నెవ్వడేని
తప్పులను జేయుననుచును జెప్పె నేని
వానియంతటి మూర్ఖుండు వసుధ నెచట
లేడనుట జెప్పవలెనె నే ప్రోడలార॥

రాజు—జయలోలా! నీవాతనిపై మోపు నేరంబునకు తగిన కారణంబుల జూపవలెగాని యిట్టియూహలు చాలవు.

౧. మంత్రి—అయితే జయద్రథా! నీవా కన్యను మీయిరువురమనస్సులు కలియుటవలన పెండ్లాడితివా? లేనియెడల నామెను మందులవలన నీవశంబు జేసితివా? దీనికి యుత్తరమిమ్ము.

జయద్ర—నామనవి చిత్తగింపుడు. దీనికుత్తరము నేనొసగుటకంటె నామెనిక్కడకు రప్పింపుడు. ఆమె నాపై నించుకైనను నేరము మోపినయెడల నేను నాయుద్యోగంబును మానికొని మీయిష్టమయిన శిక్షననుభవించెదను.

రాజు—గుణవతినిచ్చటకు దోడ్తెండు.

జయద్ర—కలహప్రియా! ఆమెయున్నచోటు నీవెఱుంగుదువు. కాన నీవేగి యామె నిచ్చటికు తోడ్తెమ్ము.

[కలహప్రియుడును సేవకులును నిష్క్రమించెదరు.]

ఆమెవచ్చెడువరకు నేనామె మనస్సు నాపైపుత్రిప్పుట కెట్లు సమర్థుండనైతినో

దానిని మీకెరింగింపనాజ్ఞయిండు.

రాజు—ముఖ్యముగా చెప్పుము—

జయచంద్ర—సీ॥ బయలైన ప్రేమనీజయులోలుడనిశంబునను దనయింటికిగొనుచునుండె

గొని మందంబున నన్ను జనువునబాల్యంపు చేష్టలనెల్లను చెప్పమనును

౧. మంత్రి—పిమ్మట.

జయ—అతని యాజ్ఞకుబ్రీతి నడుగు దాటక నేనుస్థలమందు జలమందు జరపియున్న

ఘోరయుద్ధంబుల గొప్పముట్టడులనుగడునసాధ్యంబైన కష్టములను

దానిసగాగొనబడిన దుర్దశలనుధనమిచ్చి తిరిగినేతప్పికొనుట

నెరిగించి మరియు నాకెరుకైనభీకర కాంతారములవీరు గనగరాని

పలుయెడారుల కథల్ తలచినమాత్రానజను లెవ్వరైనను జడియునట్టి

నరులను భక్షించు నరులచారిత్రముల్ తలలు కక్షములలో గలుగుజనుల

గలవింతలునుజేప బలుకుచునుండంగ గుణవతి తనకోర్కెకొనలుసాగ

చెవియొగ్గివినుచుండి చిత్రంబుగనునింటగలపనికొరకు బోవలసినపుడు

పోయియాపని శీఘ్రముగ జేసి నాకథనాలింప మరలదానర్థివచ్చు

౧. మంత్రి—అడ్డమేమి. తరువాత

జయ—దీనినంతయుజూచి, నేననూనప్రేమనాపె "నీకథజెప్పు" మనుచు నేదు

టయుగాంచి తిరుగనంతయుజెప్ప వినినాదుకష్టంబులకు దనకరుణజూపె

నెట్లుదాటితిరిన్ని యిక్కట్టులనెకటా! పాపంపువిధియని పలికె; తుదకు

౧. మంత్రి—అనుటకు సందేహమేమి?

జయ—"నన్ను పెండ్లియాడు నరునకునీకథల్ చెప్పటబ్బినమేలు చెప్పదరమె

యనె" దానననూహించి యామెవాంఛను నేను గనిపెట్టితిని నిదేకారణంబు

గీ॥ మాదుపెండ్లికిపేరె నేమందు తెరుగ

నివియెమందులు లలితాంగికిష్టమైతి

గాన పెండ్లియైతి నాగానలోల

నదిగో యామెయె వచ్చుచున్నది యిటకును!

రాజు—నీకథ నాకొమార్తెనైనను వలపింపగలదు. జయులోలా. ఈకార్యము నెమ్మదిమీద యోచింపవచ్చును. అయితే వట్టిచేతులకంటె విరిగిన యాయుధములుపయోగించుట తెలివిగలవారిపని.

[సశేషము.]

12 వల్లూరి - పద్మనాభరాజు.

ఆ నం ద బా యి జ్యో షి. య మ్. డి.

(౮౮-పుట శేషము.)

మిస్ సుజ్యోషీగారు లివర్‌పూలు పట్టణమునుండి న్యూయార్కు పట్టణమునకుఁ బ్రయాణమైన దినముననే పండితరమాబాయిగారును ఆమె చిన్న కొమార్తెయు నింగ్లాండునకుఁ జేరిరి. వారిరువురును 1883వ సంవత్సరమునందలి వసంతకాలమునందు నింగ్లాండులో నాకరును సంఘరాష్ట్రములలో నాకరును మిగుల గారవింపఁబడిరి. ఆనందబాయిజ్యోషీగారు ఫిలడెల్ఫియాశాస్త్రపాఠశాలయందుఁ జేరి విద్యాభ్యాసముఁ జేయనారంభించెను. ఆమెపడినకష్టములు చూచినవారికే కాని తెలుపదవు. పదునెనిమిది వత్సరములుగల యీబాలిక మిగుల శ్రద్ధతో విద్యఁగరచుచుఁ గులాచారభంగము కలుగకుండ స్వయముగా వంటఁజేసికొనుచు పాటుపడుచుండెను. ఆమెయింటియొద్ద నెప్పుడును ఒంటరిగానుండలేదు. ఆమెతండ్రిగారింటివద్దనున్నప్పుడు కుటుంబములోఁ జేరిన వారనేకులుండిరి. తరువాత భర్తగారింటికి వెళ్ళినప్పుడు టపాలు కచ్చేరిలో భర్తగారికి నుద్యోగమగుటచే నాకచ్చేరిలోనే వీరుభయులు కాపురముండిరి. కాబట్టి అప్పుడుకూడ నీమెయొంటరిగా నుండలేదు. కానియిప్పుడు మాత్రము ప్రత్యేకముగా జీవించవలసివచ్చెను. అయినను ధైర్యమువదలక విద్యయందె చిత్తమునుంచి శ్రద్ధతోఁ బాటుపడుచుండెను. రెండువారము లీప్రకారము జరిగినతరువాత నామె శరీరములో రుగ్ణతప్రవేశించెను. ఆమె శరీరస్థితినిచూచి మాయింటికిఁ దీసికొనిపోతిని. అదిమొదలు ఆమెపాఠశాలవదలువరకు మాయింటియొద్దనే యుండెను. ఆమె నడతమిగుల శ్లాఘాపాత్రము.

"1884వ సంవత్సరపు వసంతకాలమునందు మిషనరీ సంఘమువారు జ్యోషీగారి నొకయుపన్యాసముఁ జేయుమని కోరిరి. ఆమె యందులకియ్యకొని "బాల్యవివాహము"ను గూర్చి ప్రస్తావించుటకు సమకట్టెను. ఆమె "బాల్య వివాహము" మంచిదని చేసిన యుపన్యాసమునకు నక్కడ చేరినవారందరు మిగుల నాశ్చర్యపడిరి. ఏప్రిల్ నెలలో నామెయుపన్యాసమును వినినవారికి నాసంగతివిషయమై యభిప్రాయభేదము కలిగినపక్షమున పండితరమాబాయిగారు చేసిన గ్రంథములో వివాహవిషయమయి వ్రాసినసంగతులను చదివినయెడల జ్యోషీగారు చెప్పిన యంశములు స్పష్టమగును.

"నేను అమెరికాదేశమునకు హిందువుగానే వెళ్ళి స్వదేశమునకు హిందువుగానేవచ్చి కులస్థులనడుమ హిందువుగానే జీవించెదను" అని జ్యోషీగారు చెప్పిరి.

ఆప్రకారముగానే చదువుకొని యంత్యదశవరకు నాశపథమునే నెరవేర్చుకొనెను.

దూరదేశములనుండి వెలువడి కొంతకాలమునకు తిరిగి తనతల్లి మొదలగు స్వజనము నొద్దకుఁ జేరెను. కాని శారీపోషణవలన నామెతిరిగి శరీరములో స్వస్థతఁ జేయుటకు వారెన్ని ప్రయత్నములు చేసినను అవియన్నియు విఫలములాయెను. అత్యాతురతతో రేయింబగళ్ళు ఆమెమంచము నొద్దనారందరు కనిపెట్టియుండిరి. చివరకు ప్రియమైన తల్లిగారిచేతులలో నామెప్రాణములువిడిచిపెట్టవలసివచ్చెను. ఈయాపద పునాపట్టణములో నామెమెట్టినింట 1887 సం॥ ఫిబ్రవరు 26వ తేదిని తటస్థించెను. ఆమెకళేబరమును దహనముచేయక పూర్వము ఆమెభర్త యొకపటమును (Photograph) తీయించెను. ప్రాణవిహీనమయిన యీయామెయాకారము వర్ణింప నలవిగాదు. ఆమెజీవితకాలములో తీసినపటము లన్నిటిలో నిదియే మిగుల రసవంతమగునది. చలించని నేత్రములు అతివిచారముచే దిల్లనై బాల్యదశయందే వృద్ధాప్యమును పొందుచూపు ముఖమును చూడగా నామె అమెరికాదేశపు స్నేహితులకు “నేను చేయవలసినదంతయుఁ జేసినాను” అనువార్తను పంపుచున్నట్లు కనుపడెను. ఆహా! ఆమె స్వల్పకాలములోఁ జేయవలసినదంతయుఁ జేసిపోయెను! దూరదేశమునుండి వచ్చుటచేత నామెయు, భర్తయుకూడ కులస్థులచే ననాదరణ చేయబడి బహిష్కారము చేయబడవలసినది. అట్టిసంగతిలో వైద్య శాస్త్రమందు డాక్టరు పట్టమునందిన యీచిన్నది స్వగృహము చేరినదన్నవార్త వినినతోడనే మతస్థులందరు గుంపుగుంపులుగావచ్చి యీయామెను గౌరవించిరి.

కులాచారసంస్కారకులుకూడ నామెకుజరిగిన గౌరవమునుచూచి యాశ్చర్యపడిరి. ఆమెశరీరస్థితినిగూర్చి వార్తాపత్రికలన్నియు ప్రతిదినమును వ్రాయుచు నామె చనిపోయిన దినమున పునాపట్టణములోని వార్తాపత్రికలన్నియు నీమె మరణమునుగూర్చి వ్రాసి కాకితమంతయు నల్లసిరాతో మరణవార్తను సూచించు చిహ్నములను కనుపరుచుచు తమదుఃఖమును బయలుపరచెను. ఆమె విషయమయి ‘కేసరి’ పత్రికలో నీప్రకారము వ్రాయఁబడినది.

“డాక్టరు ఆనందబాయిజోషీ మనలను విడిచి లోకాంతరగతురాలాయెను. కాని యీమె సంపాదించిన కీర్తి చిరతరమైనది. మనదేశపు స్త్రీలలో మరికొందరు కూడ నీమెవలె శాశ్వతమైన కీర్తిని సంపాదించుటకుఁ బ్రయత్నము చేయుదురని నమ్ముచున్నాము. ఈమెను మనము సదాజ్ఞాపకముంచుకొనుటకుఁ దగినప్రయత్నములు చేయవలయును. వైద్యశాస్త్రము నభ్యసించుట కియ్యకొను స్త్రీలకు నామెపేరుమీదుగా ధనసహాయము చేసినయెడల నానందబాయిజోషీగారి ఋణమును మనము

తీర్చుకొనినవార మగుదుము. కాఁబట్టి యీయామె పేరు శాశ్వతముగా నుండునట్లు చేయుటకు మన దేశస్థులందరు ప్రయత్నించెదరని నమ్ముచున్నాము"

పునాపట్టణవార్తా పత్రికలలో నొకటి యైన "జ్ఞానచక్షువు" నందు 1887 సం॥ మార్చినెల 2వ తేదిని యీయామె మరణము విషయమయి యీప్రకారము వ్రాయఁబడినది.

"గడచిన స్థిరవాసరము రాత్రి రెండు యామములప్పుడు ఆనందబాయిజోష్యషిగారు మన లోకమును వదలి పరలోకమును పొందిరి. ఆమె మరణమువలన మన హిందూదేశమునకు గొప్పనష్టము కలిగినది. అదివరకు రెండుమాసములనుండి యీయామె పునాపట్టణములో నివసించుచుండెను. ఆమె శరీరస్థితి బాగుగనుండనిహేతువుచే నక్కడివైద్యుల చికిత్స నిమిత్తము పునాపట్టణమును చేరెను. కాని చికిత్సలవలన ప్రయోజనము లేకపోయెను.

మిగుల బాల్యురాలయినను, ఆమె ధైర్యస్థైర్యములును, భర్తయందలి భక్తిశ్రద్ధలును మిగుల శ్లాఘనీయములు. ఆమెను పోలు స్త్రీలు మరికొందరు బయలు దేరుదురని మేము నమ్ముచున్నాము. హిందూదేశపు సుందరులలో నీయామె మిగుల ఘనత కెక్కినదని చెప్పవచ్చును. ఆమె నేర్చిన విద్యవలన నామె సుగుణసంపత్తి వృద్ధియయ్యెను. మిగుల బలమయిన వ్యాధివలనఁ బీడితురాలయినను వ్యాధి విషయమై యెప్పుడును మొరపెట్టలేదు. కొన్నిదినములు బాధపడినతరువాత నామె శరీరమంతయు కృశించి యెముకలు బయలుపడినవి. ఆమెను చూచినవారందరును మిగుల వ్యసనపడిరిగాని ఆమెమాత్రము వ్యసనపడక వ్యాధిని అనుభవించుట తనకు విధియైన పనియని యెంచి ధైర్యము నవలంబించియుండెను. ఆమెయొక్క ప్రతిమను తీసినతరువాత నామె శరీరమును స్నానము చేయించి మంచిబట్టలు వస్త్రువులు మొదలయినవానితో నలంకరించి ఆమె బంధువులును, మరణవార్తఁ వినిన పునాపట్టణవాస్తవ్యులందరును చేరి వారికి జోష్యషిగారియందుఁగల ప్రేమాతిశయమును కనుపరుచుచు దహనసంస్కారక్రియలు జరిగించిరి. ఆమె దేశాంతరమునకుఁ బోయివచ్చినందువలన హిందూ మతాచారముల ప్రకారము దహనము చేయుటకు కొంతమంది యభ్యంతరములు పట్టుదురని భయపడిరిగాని అట్టిభయమునకుఁ గారణము లేదయ్యె. మతస్థులందరును ఆమెను మతపద్ధతులననుసరించి దహనము చేయుటకియ్యకొని యథావిధిగా కర్మ చేయించిరి. ఆమె కళేబరమును చితిపైనిపెట్టినతరువాత వి, యమ్, రానడీగారు ఆమెవిషయమయి యుపన్యాసము చేసిరి. అటుతర్వాత శవమును దహనము చేసిరి."

అహల్యాబాయి.

సాలివర్ణమునందుద్భవమై గొల్ల వాండ్రకులవృత్తిఁ జేయుచు మల్హారిరావుగారు మధ్యహిందూస్థానమందు నేఁటివరకు హోల్కారు రాష్ట్రములని వాడఁబడు దేశములను అన 1724-1765 సంవత్సరములమధ్య నేకగ్రీవముగాఁ బరిపాలించెను. దౌావనమందీయన నివసించిన హోల్ అను గ్రామమునుపట్టి వీరిసంతతివారికి హోల్కారు అనునామము కలిగెను.

మల్హారిరావుగారు 1765 సంవత్సరమునందుఁ బరలోకగతుఁ డాయెను. ఆయనకుమారుఁడు ఖండీరావు 1754 సంవత్సరమునందు యుద్ధరంగములో హతుఁ డాయెను. ఆయన సింధియాకుటుంబములోఁ జేరిన అహల్యాబాయి అనునామెను వివాహముచేసికొని ఆమెవలన నొకకుమారుని కొమార్తెను బడసెను. 1765వ సంవత్సరమునందు మల్హారిరావుగారు చనిపోయినపిమ్మట ఆయనపౌత్రుఁడు సింహాసనమునకు వచ్చెనుకాని చాలకాలము జీవించలేదు.

అప్పుడు దివానుగానుండిన గంగాధర్ గారు అహల్యాబాయితోఁ గుమారుని పెంచుకొనవలసినదనియు రాజ్యపరిపాలన తాను చేసెదననియు చాలదూరము చెప్పెను. ఈప్రకారము చేయుటకు అహల్యాబాయిని ప్రోత్సాహపరచ వలసినదని పీష్వాకు పినతండ్రియగు పునానివాసుఁడగు రఘునాథరావుగారికి గొప్పగా లంచమిచ్చుటకుఁగూడ ప్రయత్నించెనుకాని అహల్యాబాయి అందుకు సమ్మతించలేదు. ఆమె సేనలను స్వయముగా నడపుటకు సిద్ధపరచి తన అంబారికి నాలుగుమైపులను బాణములలోనింపిన అమ్ములపొదులను ధనస్సులను కట్టుటకు అజ్ఞాపించెను. దివానుగారు చేసిన ప్రయత్నములు విఫలములై ఆయనకూడ లోఁబడెను. ఆయన వెనక చేసిన మంచిపనులనుపట్టి క్షమింపఁబడెను.

ఆమె సింహాసనమెక్కినప్పుడు భాండారములలో విశేషముగా ద్రవ్యము కలదు. ఆమెమొదటిపని యీద్రవ్యమును ధర్మార్థముక్రింద వినియోగపరుచుట. అందులకై తులసీయాకులు నీటియందుంచి ఆయాకులతో ధనముపైని యుదకముచల్లి బ్రాహ్మణులచేత మంత్రములు మొదలగునవి చదివించెను.

మల్హారిరావుగారి కుటుంబములోఁ జేరినవాఁడును ఆయనవలన మిగులగౌరవింపఁబడినట్టివాఁడును అగు తుక్కాజీహూల్కారును ఆమెసేనానాయకునిగా నేర్పరచుకొనెను. అతఁడామెయొద్ద బహువిశ్వాసముతోఁ బనిచేయుచుండెను. అహల్యాబాయిని తల్లియని భావించుచుండెను. ఆమె యాతనియెడల పుత్రభావముకలిగియుండెను.

12 అ - సుందరరామయ్య. [సశేషము]

స్త్రీహితోపదేశము రజోవిషయము.

(౯వ - ఘట్టశేషము.)

ఎడమ పార్శ్వమందు తరుచుగా నొప్పి కలిగియుండును. ముక్కువెంబడి రక్తము వచ్చుచుండును. దానిని ఆపకూడదు. ముఖమందును శరీరమందును అక్కడక్కడ చిన్న చిన్న పొక్కులు లేచును.

ఈపైని చెప్పబడిన లక్షణములలో నన్నియుఁగాని కొన్నిగాని కనుపడినప్పుడు తగిన చికిత్స వెంటనే చేయించుకొనవలయును. లేనిపక్షమందు చాలజబ్బు చేయును. మంచిచికిత్స జరిగినయెడల మంచియారోగ్యము కలిగి, తరువాత యావజ్జీవమును సుఖముగానుండును.— ముట్లుడుగుకాలమునకు కలుగు క్రొవ్వు శరీరసాధకము చేత పోవును. శరీరసాధకము చేయుచున్నయెడల, ఆకాలమందొకవేళ గర్భోత్పత్తి యయినను సుఖప్రసవమగుటకు సుగమముగానుండును. మఱియును నలువదియెనిమిది సంవత్సరములు వయస్సువచ్చువరకు బహిష్ఠగుచుండును. ముట్లునిలిచిపోవు కాలమునకు మూలశంకజాడ్యము వచ్చి ఆసనము వెంబడి రక్తము స్రవించును. అయినను కొద్దికాలమునకు దానంతటదికట్టిపోవును గనుక అందును గురించి చికిత్స చేయనక్కఱలేదు.

బహిష్ఠగుట నిలిచిపోవుకాలము పైనిచెప్పినప్రకారము అనేక కారణము[illegible] చేత మిగుల శ్రద్ధతో కనిపెట్టవలసియుండునదిగావునను, అది మొదలుక[illegible] శరీరారోగ్యమునకును, అనారోగ్యమునకును ఆకాలమందు పుచ్చుకొను శ్రద్ధా[illegible] లే కారణములగునుగనుకను స్త్రీలందు విషయమయి విశేషము జాగ్రతను వహించవలసియుండును.

స్త్రీహితోపదేశము.

తృతీయాధ్యాయము.

గర్భచిహ్నలు.

గర్భిణియయినట్లు తెలిసికొనుటకు మామూలుప్రకారము బహిష్ఠకాకపోవుట యనగా నెలతప్పుట, మొట్టమొదటి గుఱుతుగా నెంచవచ్చును. స్త్రీకి మంచిశరీరారోగ్యము కలిగియున్నప్పుడిదియొకటే గర్భోత్పత్తికి ముఖ్యచిహ్నముగాఁ జూచుకొనదగును. కాని నెలతప్పుటకు మఱికొన్ని కారణములుకూడ యుండుటకలదు. గర్భమందేదైన ఒకజబ్బుగాని శ్వాసకోశములు మొదలగు నితరఅవయవములయందేదైన నొకయక్రమముగాని సంభవించియున్నయెడల నదియును బహిష్ఠకాకుండఁజేయును. కావున నెలతప్పుటమాత్రమే గాక మఱికొన్ని చిహ్నలుకూడ కనిపెట్టవలెను.

గర్భచిహ్నలలో వేవిళ్ళని మనవా రనుకొనునది రెండవదిగా నెంచుకొన వలయును. ఇది గర్భోత్పత్తియయినతోడనే యనగా, నయినతరువాత పదిరోజులు లేక యిరువదిదినములలో కనుపడునదిగానున్నది. వేవిళ్ళనగా నుదయకాలమందు వమన మగుటయు ప్రాతర్భోజన మిష్టము లేకపోవుటయు, నయియున్నది. ఈయిబ్బంది మూడునాల్లు మాసములవరకునుండును. ఇది కొందరికి లేకపోవుటయు గలదుగాని తరుచుగానిదియొకవిశేష చిహ్నముగా నెంచుదురు. ఇది యజీర్ణము మొదలయిన జఠరదోషములవల్ల కలుగకపోయినయెడల నమ్మదగిన గురుతుగానే యుండును. మఱియునిదియుదయకాలమందేగాని కలుగదు గనుక గర్భిణిచిహ్నరోమ మఱియొకటియోసులభముగానే కనుగొనవచ్చును.

మూడవచిహ్నము. స్తనములయందు చుఱ్ఱుచుఱ్ఱుమనిపోట్లు దడదడ ఈవిధమయిన నొప్పియు అవిపెద్దవగుటయును చనుమొనలు సలపెక్కుటయును గర్భమయిన రెండవమాసమందు కలుగును. కొన్నిమాసములైన వెనుకపిండినచో స్తనముల వెంబడిని నీళ్లవంటిద్రవము లేకపాలు వచ్చును. ఈచిహ్నము ప్రథమగర్భవిషయమయి గర్భోత్పత్తియయినట్లు నిశ్చయచిహ్నముగా గ్రహించవచ్చును.— స్తనముల [illegible]క్క నరములు స్పష్టముగాను నీలముగాను కనుపించును. స్తనములు గట్టి[illegible] దృఢముగాను నుండును. దానిమొనలు పెద్దవై పైకివచ్చును. అందుపైని కొంచెము తడియుండుచునుండును. గర్భమయినపిమ్మట రెండవమాసములో చనుమొనలు చుట్టును గాఢమయిన గోధుమవర్ణముగల చుక్క కనుపించును. దాని రంగు మొట్టమొదట సాధారణముగాను క్రమ క్రమముగా గాఢముగాను నుండును. ఈచుక్క నల్లనితలవెంట్రుకలు నల్లనినేత్రములు నల్లనిశరీరచ్ఛాయ గలవారికి ఎక్కువనల్లగాను, ఎఱ్ఱగానుండువారికి సాధారణ నైల్యముగలదిగానుండును. ఇది అంగుళము మొదలుకొని యంగుళమునరవరకు వెడల్పుకలిగియుండును. చాలమందికి అందులరుగువలెనే దానిపై శాల్యమును హెచ్చుచుండును. అదికొంచెముబ్బెత్తుగా నుండును. ఈచిహ్నము, ప్రథమగర్భమునకు ప్రధానచిహ్నలలో నొకటిగా నెంచవలెను. సంతానవతులకు దీనినిబట్టి గర్భోత్పత్తి నిశ్చయించుట కష్టము.

నాల్గవచిహ్నము- శిశుచలనమనగా కడుపులో బిడ్డకదలుట. ఇది సాధారణముగా నాల్గవ మాసముయొక్క యంత్యమున కలుగును. కొందఱికిది మూడు మాసములగుసరికి తటస్థించును. అయిదు మాసములకు కలుగుటయరుదు. ఆరుమాసములవరకు నిది సంభవించకపోవుటయును గలదుగాని యదిబహుఅరుదు. ఒకవా

రము హెచ్చుతగ్గుగా నాల్గుమాసములగుసరికి కలుగుట సర్వసాధారణము.—ఈ లక్షణమును గర్భోత్పత్తికి ముఖ్యలక్షణముగా నెంచవలసియున్నది. శిశువుకదలుట యారంభముకాగానే గర్భము పెద్దదగును. కదలిక కలుగుట గర్భిణికించుమించుగ సగముకాలమయినట్లెంచుకొనవచ్చును. ఈశిశుచలనకాలములో కొందరు స్త్రీలకు కన్నులుతిరుగుట మూర్ఛవచ్చుటయు మొదలయిన బాధలుకలుగును. ఆకాలమందొ క్కొక్కస్త్రీకి ఒడలుతెలియదు. ఇది బహుఅరుదు. శిశువు కదలినప్పుడేలాగున్న ను డునని స్త్రీలనడుగగా కొందరు పక్షిరెక్కలు కొట్టుకొన్నట్లుండునని చెప దురు. కొందరు జారినట్టు కొట్టినట్టు దుమికినట్టు లుండునని చెప్పుదురు. క యారంభమయినమరునాటినుండి యీకొట్టుకొనుటయు దుముకుటయు కొట్టు దినమునకారు మొదలుకొని పండ్రెండుపర్యాయములవరకుఁ గనుపడును. కొన్నిదినములవరకు నేవిధమయిన కదలికయునుండదు. ఉన్నను కొద్దిగానుండ ఈశిశుచలనము మొట్టమొదట బక్షిరెక్కలు కొట్టుకున్నట్లు యుండుననియు, ఒకమాసమునకనగా నారవమాసమందు దుమికినట్లుండుననియు చాలమందిచెప దరు. ఇట్టిభేదము సకారణమనియెంచవచ్చును. ఏమనగా నాల్గైదుమాసములమధ్య శిశువునకు కొట్టుకొనుశక్తిగాని దుముకుశక్తియుండదు. ఆరవమాసము దట్టిశక్తికలు గును—ఈచలనమునకు రెండుకారణములుకలవు. ౧. గర్భము పెద్దదై క్రిందస్థలము లేక పొత్తికడుపులోనికి వ్యాపించును. ౨. శిశువునకవయవములను కదల్చుశక్తికలిగి గర్భగోళములో నటునిటు తన్నుచు కొట్టుచు పడుచునుండును. కొందఱుస్త్రీలకు జఠరవాయుదోషముచే గర్భము పెద్దదైనప్పుడు గర్భమును శిశుచలనమయినట్లూ హింతురు. నిజమయిన గర్భమునకును గర్భమువలె కనుపడు సదరుదోషమునకును భేదమేమనగా దోషమయిన గర్భమొకప్పుడు పెద్దదిగాను మరియొకప్పుడుచిన్నది గాను అగును- గర్భమయినయెడల వృద్ధి క్రమాభివృద్ధికలిగియుండును- జబ్బయిన యెడల నొక్కినప్పుడు గాలియొక్కధ్వని, అనగా మద్దెలమీద వాయించినప్పుడు కలుగుధ్వనివంటి ధ్వనివినబడును- నిజమయిన గర్భమయినయెడల గట్టిగాను నొక్కిన నొక్కబడకయును బల్లమీదవాయించినట్లుధ్వని గలిగియుండును-

అయిదవచిహ్నము- పైనిచెప్పఁబడిన శిశుచలనము కావేగిరమే కడుపుపెద్ద దైగట్టిపడును- కొందరికి క్రొవ్వుపెరిగి గర్భమయినట్లు కనుపడునుగాని నొక్కి- చూచినప్పుడదైనదియుని దైనదియు భేదము తెలియును- క్రొవ్వయినయెడల మెత్తగా నుండును-

ఆరవచిహ్నము-బొడ్డుపైకివచ్చుట- శిశుచలనమైన మరికొన్ని దినములకుగాని

యుదిరకులుగదు- గర్భోత్పత్తియయిన మొదటి రెండు మాసముల వరకు బొడ్డు లోపలికి దించుకొనిపోయియుండును- నెలలునిండినకొలది పైకివచ్చును- నిజమైన గర్భిణులకు బొడ్డుపొత్తికడుపుతో సమానముగా నగును- గర్భముగునా కాదాయని సంశయము కలిగియున్నప్పుడు దీనినికనిపెట్టవలెను-

ఏడవచిహ్నము- చిక్కిపోవుట- ముఖము అందులో ముక్కు మరింత కృశించును- ముఖలక్షణముమారును- ఇట్లుగర్భమైన ప్రారంభములోనుండును- నెలలు ...ండినకొలది తిరిగి ముఖవికాసము యథాప్రకారముగానుండును- దేహపుష్టిగల ...లు హఠాత్తుగా కృశించినయెడల గర్భిణులైనట్లు తెలిసికొందురు- ఆచిక్కిపోవు ...లలునిండు సమయములోగాని ప్రసవానంతరమునఁగాని తిరిగిపూర్తియగును-

ఎనిమిదవచిహ్నము- మూత్రబాధ తరుచుగా గలిగియుండును- మొదటినెల ...సీబాధవిశేషముగానుండి రాత్రులు లఘుశంక కనేకపర్యాయములు లేవ ...వచ్చుచుండును- మరలకొద్దిగానేగాని విశేషముగానుండదు- శిశుచలనమైన ...రువాత నీబాధపోయి ప్రసవసమయమునకు ముందు మరలకలుగునుగాని యప్పు...ు బాధయేమియునుండదు- ఇందువలన గలుగుబాధ స్వల్పచికిత్సచేతపోగలదు-

ఈపైనిచెప్పబడిన యెనిమిదివిధములయిన చిహ్నలలో ముఖ్యములైనవన్నియు నున్నప్పుడట గర్భోత్పత్తి యైనట్లు నిశ్చయించుటకు మరికొన్ని సామాన్య చిహ్నలుకూడ కనిపెట్టవలసియుండును- అవేమనగా విశేషనిద్ర- గుండెలలోమంట- చొంగ విశేషముగాబయలుదేరుట- ఆకలితగ్గుట- కోరికలు హెచ్చుట- మనస్సు చలించుట- శరీరముమీదమచ్చలు బయలుదేరుట- భోజనపదార్థములలో నిష్టానిష్టములు—ఇవి గర్భోత్పత్తివలననేకాక యితరకారణములచేతనుగూడ కలుగవచ్చునుగాని పైనిచెప్పిన యెనిమిది విధములైన లక్షణములు నివియునుకూడనున్నయెడల నిశ్చయముగా గర్భమైనట్లు రూఢిగా నమ్మవచ్చును-

నిద్ర— గర్భిణులకు సమయాసమయములనక యెల్లప్పుడును నిద్రవచ్చుచుండును.

గుండెలమంట— కొందఱు గర్భిణులకీబాధ విశేషముగానుండును- గాని యిదియున్నవారికి ఏలోపములేకుండ నెలలుగడిచిపోవునని నిశ్చయించుకొనవచ్చును- మరియు నిది సులభముగాశాంతించును-

నోటివెంబడిని విశేషముగా ద్రవముబయలుదేరుట గర్భోత్పత్తికి లక్షణము- ఇదియసహ్యకరముగానుండును గాని దీనివలనహానియేమియులేదు- ఈబాధ కొన్ని దినములవరకు నుండును- ఒకప్పుడు కొన్నిమాసములవరకుపోదు- [సశేషము-]

"OUR DUTY TO OUR FILTHY NEIGHBOURS IN SOUTHERN INDIA."

(౯౭-వ పుట శేషము.)

ఇప్పుడు ప్రజావృద్ధి విశేషముగా నగుటచేతను నాగరికతచేతను నివాసమునకు తగినస్థలము కుశలమైనది. ఈహేతువుచేతనే మనము ముఖ్యముగా శ్రద్ధపుచ్చుకొనవలసియున్నది. మనము ముందుగా పట్టణములలో పెంట, మురికినీరు మొదలగునవి నిలువనియ్యక, వానిని దూరముగా విసర్జించు సాధనములు చేయవలెను. ఎవరియిల్లు వారు చెత్తయేమిలేకుండ జాగ్రత్తపెట్టుకొనవలెను. పట్టణ సమాజము వారు ఊరుశుభ్రముగా నుంచవలెను. అధికారులు సంబంధము కలుగజేసికొని మురికిగుంట్లను తోడివేయించవలెను. పెంటపోగులు నిలువనియ్యకూడదు. కాపురముండు గృహములకు చేరువగా పశువులసాలలుండనియ్యకూడదు. వీధులు కాని ఊరికి సమీపముగానుండు గయాళు కాని చెరుపనియ్యకూడదు. మురికినీరు పోవుటకు తగిన జలదార్లు కట్టించవలెను.

Pure water—పానముచేయు జలము శుభ్రముగా నుండుటకై జలాశయములు జాగ్రతగా కాపాడవలయును. మనలో కడజాతివాడు దాహముచేత గొంతు ఆర్చుకొనపోయి నీరుత్రాగుటకొరకు కాలువయ్యగాని చెరువుగాని సమీపించిన యెడల వాడు ముట్టుకొనిన మాత్రమున చెరువు మైలపడి పోవునని దానిచెంతకు వానిని చేరనియ్యము. ఒకవేళ వాడు ముట్టుకొన్నయెడల వాడు ఘోరమైన నేరము చేసినట్లు చూతుము. చెరువునకు సంప్రోక్షణ చేయింతుము. సంప్రోక్షణమయినతరువాత నా గ్రామము, అచెరువులో మైలబట్టలుతుకుదురు. కొందరు ముఖము కడుగుకొని నీళ్ళు పుక్కిలించి ఉమ్మివేయుదురు. కొందరు ఒడలు తోముకొని స్నానము చేయుదురు. ఈపనులు మనదేశములలోనేకాని నాగరికతగల యే దేశములోను సాగనేరవు. ఊరికి నొక్కటే మంచినీళ్ళ చెరువుండినయెడల కడజాతివారి యుపయోగము కొరకై యాచెరువునకుసమీపమున నొకనుయ్యి త్రవ్వించవలెను. ఇట్లుచేసినయెడల వారికి త్రాగుటకు శుభ్రమైన నీరుదొరకును. ఇప్పుడక్కడక్కడ మంచినీళ్ళ చెరువులనుగురించి కొంచెము జాగ్రత పుచ్చుకొని చెరువులలో స్నానముచేయుట, బట్టలుతుకుట మొదలైనపనులు మానిపించుటకయి కావలా మనుష్యులను జీతమిచ్చి యుంచుచున్నారు. పల్లెటూళ్ళలో చెరువు లధికారుల స్వాధీనములో లేనిహేతువుచేత నెవ్వరేమి చేసినను, నోరెత్తుటకు వీలులేదు. ఆదిని మనఋషులలో కొందరీవిషయమై కొన్ని నిబంధనలు చేసినారనియు మనమిప్పు డేమిచేయ నవసరము లేదనియు మనలో కొందరు చెప్పుదురు కాని మనఋషులు చేసిన నిబంధనలు తాటియాకుల పుస్తకములనువదలి యెన్నడును అమలులోనికి రాలేదు. కాబట్టి మనమిప్పుడు వానిని పట్టుకొని వ్రేలాడిన ప్రయోజనము లేదు. ఇప్పటి

ధర్మశాస్త్రాధికారులు అవసరమైన నిబంధనలనేర్పరిచి అమలులోనికి తేవలెను. చెడునీరు పానము చేయుటవలన మనదేశములో మరిడీజాడ్యములు, జ్వరములు, గ్రహణి మొదలయిన వ్యాధులు పుట్టి ప్రాణనాశముకూడ కలుగజేయుచున్నవి. చదువుకొన్నవారు శుభ్రమయిన జలమును కాపాడుటకై ప్రయత్నము చేయుచున్నారు. ప్రజలకందరకు నిట్టిశ్రద్ధ పుట్టవలెను. స్కూళ్లలో నుపాధ్యాయులీవిషయమై శ్రద్ధపుచ్చుకొని పూనికతో పనిచేసినయెడల తప్పక లాభము కలుగును.

Drainage—మురికినీరు పోవుటకై బహుజాగ్రత పుచ్చుకొనవలెను. మురికినీరు భూమిలో నిలకకుండునట్లు జలదార్లు నిటుకతోగాని రాతితోగాని కట్టించవలెను. జలదార్లలో నీరు నెన్నడును నిలువనియ్యగూడదు. ఆరీతిని జరిగినయెడల మిక్కిలి చెరుపు కలుగును.

Prevent over crowding. modal Ruts-Emigration:—అధికారు లిండ్లు నిరుకుగా గట్టనియ్యగూడదు జనసమ్మర్దము విస్తారమున్న స్థలములలో క్రొత్తయిండ్లు కట్టనియ్యగూడదు. మనలో ధనికులు కొందరు వేలకువేలు రూపాయలు సోమరిపోతులను మేపుటకై కర్చుపెట్టుచున్నారు. అట్లుచేసిన మనకేమియు లాభము లేదు. వారిలో కొందరైనను భూతదయకలవారై పాత్రులయిన బీదలకు నివాసార్హములైన చిన్నగృహములను కట్టించి యిచ్చినయెడల, దేశమునకెంతో యుపకారులగుదురు. అట్టివారి నెన్నటికిని ప్రజలు మరువజాలరు. సాధారణముగా నొకగ్రామములో నొకటిరెండు మంచిగృహములు క్రొత్తవి కట్టినయెడల క్రమముగా నూరంతయు మంచిగృహములగును. ఒకరినిచూచి మఱియొకరు మంచి యిండ్లుకట్టుదురు. గ్రామాధికారులు పాటుపడి జీవనముచేయు బీదవారికి నూరుబయలున నివాసయోగ్యమైన చిన్నయిండ్లు కట్టించి స్వల్పమైన యద్దెకు నిచ్చినయెడల ప్రస్తుతము లాభమేమి కనుపించకపోయినను, తుదకు మనకు క్షేమమేకాని మఱియొకటికాదు. కూలిపని చేయువారలు సమీపమయిన దేశములకు పోయినయెడల డబ్బుసంపాదించి సుఖముగా జీవించవచ్చునుగనుక నట్లుచేయుటకు వారిని ప్రోత్సాహము చేయవలెను. ఇప్పుడు మనదేశములో రంగూను మొదలగు సమీపదేశములకుబోయి, పాటుపడి ధనము సంపాదించి కూలిపనివాండ్రు తిరిగి తమ స్వగ్రామములు చేరుచున్నారు. ఇటువంటివారిద్దరుముగ్గురు తమ యూరునకు జేరినయెడల నితరులకు హెచ్చరిక పుట్టును. కాబట్టి యటువంటివారు తిరిగి వారి స్వస్థలము సులభముగా జేరుటకు తగుసహాయము మనము చేయవలెను. మార్గములో వారికష్టార్జితము దొంగలపాలు గాకుండ మనము కాపాడవలెను.

Grant plots of waste land—మనదేశములో సేద్యము చేయుటకు దగినభూమి చాలభాగము గయాళిగానున్నది. కూలివాండ్రను కొద్దివ్యవహారస్థులను ఇటువంటి భూమి కొంతపుచ్చుకొనుటకు మనము ప్రేరేపణచేయవలయును. వట్టి ప్రేరేపణవలన నేమియు లాభములేదు. వారలకు తగిన సహాయములను జేయవలెను. కూలివాండ్రకొక్కొక్కరికి 5, 6, ఎకరముల నేల కష్టపడి ఫలపరుచుకొనినయెడల 10 సంవత్సరములవరకు పన్నులేకుండ నిప్పించవలెను. ఇప్పుడు సర్కారులో కొలువుచేసి 20 రూపాయలలోపు జీతము తీసికొనుచున్న వారికిగూడ పైనిజెప్పిన పద్ధతిని కొంతభూమినియ్యవచ్చును. ఇట్లు చేసినయెడల గయాళిభూములు పంటభూములయి ప్రజాభివృద్ధియగునట్లుగానే పంటలు కూడ యభివృద్ధిబొందును.

Increase hospital accomodation—దేశమువిశేషవ్యాధిగ్రస్తమయి యున్నదిగనుక, ధర్మాసుపత్రులు వృద్ధిచేయవలెను. ఈవిషయములో సర్కారువారు, ప్రజలుకూడ చాలపనిచేసి గౌరవమును పొందినారు. ఆసుపత్రులు వృద్ధిచేయుటకు కొంతకాలముపట్టును. 30 సంవత్సరములక్రిందట దక్షిణ హిందూస్థానములో ధర్మాసుపత్రులసంఖ్య 40కి తక్కువగానుండెను. ఇప్పుడు రమారమి 350 ఉన్నవి- ఇంగ్లండు, స్కాట్లండు దేశములలో 36000000 మంది జనులున్నారు. అక్కడియాసుపత్రులలో మొత్తముమీద 16,400 కాయిలా మంచములున్నవి. ఫ్రాన్సుదేశములో జనసంఖ్య కొంచెమెచ్చుతగ్గుగా సమానమైనప్పటికి 72,000 కాయిలామంచములున్నవి. దక్షిణహిందూస్థానములో ఆసుపత్రులలో 3,500 కాయిలా మంచములుమాత్రమే యున్నవి. అయితే మనదేశములో ఆసుపత్రులలో తరుచుగా రోగియింటివద్ద పుచ్చుకొనుటకు మందులనిచ్చెదరు. కొన్నిచోట్ల సర్కారునౌకర్లు తాము రోగులయింటివద్దకు వెళ్ళి మందునిచ్చెదరు- ఇట్లు చేయుటవలన లాభమేకాని మరియొకటికాదు. పెద్ద ఆసుపత్రులలో రోగులను ఉంచుటవల్ల కొన్ని లాభములు నష్టములుకూడ కలవు.

Huts for contagious diseases—మందునిచ్చెడి విషయములో నంటురోగములను గురించి మనము జాగ్రతపుచ్చుకొనవలెను. మనదేశములో మశూచి, విశూచి బాధ్యములు తరుచుగనుక పట్టణము చివరనొక విశాలమయిన పూరియిల్లుండవలెను. ఈజాడ్యములు వచ్చినవారిని తక్షణము మందునిచ్చుటకక్కడికి తీసికొనివెళ్ళవలెను. ఆవసరము వచ్చినప్పు డిటువంటి యిండ్లు నిముషములోఁ గట్టించవచ్చును- ఇటువంటి యిండ్లలో నుంచినయెడల రోగులకు గూడ లాభము

కలుగును. వారివారిస్వగృహములలోకంటె నిటువంటి యిండ్లలో జాడ్యము మరలుటకవకాశము హెచ్చుగనుండును.

Distribution of cheap febrifuges—జ్వరములకు క్వైనైను బీదలకు ధర్మార్థముగ నీయవలయును. మన్యప్రాంతములలో నీయౌషధము ప్రజలకు సర్కారువారు ధర్మార్థముగ నిచ్చుచున్నారు. క్వైనైను తయారు చేయుటకు సులభమయిన మార్గము క్రొత్తగా కనిపెట్టినారు. కొద్దికాలములోనే యౌషధముచాల చవకయగును.

Sanitary engineers. Sanitary surveys:— ప్రజలకు నీవిషయమై జ్ఞానము కలుగజేయవలెనని యిదివరకే చెప్పియున్నాము. ఇంతే కాక ఈవిషయములో విశేషానుభవజ్ఞానము గలవారిని యవసరమైన పనులను చేయించుటకు నియమించవలెను. మ్యూనిసిపాలిటీలకు సలహాల నిచ్చుటకు తెలివిగల స్యానిటెరీ యింజనీయరును నియమించుమని యింగ్లీషుభాషలో నీయుపన్యాసము చేసిన సర్జను జనరల్ బీడీ దొరవారు సర్కారువారినిపలుమారు కోరియున్నారు. ఈక్రొత్తయుద్యోగమునకు తగినవారు వచ్చెదరని భగవంతుని ప్రార్థింతము. క్రొత్తగా సర్కారువారు మనముఖ్యపట్టణములను స్యానిటెరీసర్వే చేయవలసినదని యాజ్ఞాపించినారు. ఇదికూడ పైని చెప్పిన సర్జనుజనరల్ బీడీదొరగారియొక్క ప్రోత్సాహముమీదనే జరిగినది.

Need for trained sanitary inspectors—స్యానిటెరీ ఇంజనీయర్లు చెప్పినప్రకారము పనులు జరిగించుటకు ఓవర్సీయర్లను ఇనస్పెక్టర్లను నియమించవలెను. ప్రస్తుతమున్నవారికీవిషయమునను అనుభవజ్ఞానము లేదు. కాబట్టి తగినవారిని నియమించవలెను. ఇప్పుడు క్రొత్తగా పెట్టిన వృత్తిపరీక్షలలో సుఖాధారప్రకాశికయొక్క పాఠముగా పెట్టినారు. ఈపాఠములో ముఖ్యముగా పరీక్ష తీరవలెనని కట్టడిచేసినయెడల స్యానిటెరీ ఇన్స్పెక్టర్లకు తగినవారు కావలసినంత మంది దొరుకుదురు. మనలో చదువుకొనినవారికి సహితమీవిషయమునం దేమియు తెలియదు గనుక పైని చెప్పిన యిన్స్పెక్టర్లావశ్యకము. ఇదిగాక పుట్టినప్పటినుండియు పరిశుభ్రముగనుండని గృహములలో నివసించుటచేత నపరిశుభ్రతపనిగా మనకు తోచదు. దొరలు మనగృహములు, మనము చేయు ఎడ్డెపనులు చూచినయెడల నసహ్యపడుదురు. ఈహేతువులచేత మనంతటమన మావశ్యకములయిన పనులను చేయించుకొనలేము. కాబట్టి యిట్టిపనులు చేయించుటకయి ఇనస్పెక్టర్లను తప్పకనియమించవలెను. [సశేషము.]

12 చిత్రపు - వేంకటాచలము.